తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఏఐ దుర్వినియోగానికి చెక్ పెట్టండి..

(హైదరాబాద్, సాక్షర): ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నకిలీ గుర్తింపులకు వ్యతిరేకంగా మరింత పటిష్ఠమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని మెగాస్టార్ 'ఎక్స్' వేదికగా...

4వ పేజీ



హైదరాబాద్ పై చలి పంజా..

హైదరాబాద్:తెలంగాణలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యు)లో అత్యల్పంగా 11.4 డిగ్రీల సెల్సియస్...

2వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 283 మంగళవారం, నవంబర్ 17, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

తెలంగాణలో భూ రీసర్వేకు కొత్త విధానం



(నిజామాబాద్, సాక్షర): తెలంగాణ ప్రభుత్వం భూ రీసర్వే ప్రక్రియలో కీలక మార్పులు చేయాలని నిర్ణయించింది. ఈ మార్పులు క్షేత్రస్థాయి సమస్యలు, అధికారుల అనుభవాలు మరియు స్థానిక పరిస్థితుల ఆధారంగా రూపొందించబడ్డాయి. రీసర్వే కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)లో మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మార్పుల గురించి ఆదాయ మరియు గృహ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. బుధవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డీఓలు మరియు సర్వే అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. 4 లో

కౌశిక్ రెడ్డికి హైకోర్టులో షాక్...



(హైదరాబాద్, సాక్షర): బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో షాక్ తగిలింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను దూషించారనే ఫిర్యాదుతో వీణవంక పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలని పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ పాడి కౌశిక్‌రెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం పిటిషన్‌ను తోసిపుచ్చింది. 3 లో

హరీష్ రావు చేసిన అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందే



(నిజామాబాద్, సాక్షర): మాజీ మంత్రి హరీష్ రావు అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల మరోసారి డిమాండ్ చేశారు. ఆయన చేసిన అవినీతిపై ప్రజాక్షేత్రంలో కొట్లాడటంతో పాటు చట్టపరంగా, న్యాయపరంగా ఉన్న అన్ని మార్గాల ద్వారా పోరాటం చేస్తామని చెప్పారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆమె మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలను సీబీసీఐడీకి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కు కూడా పంపిస్తామని చెప్పారు. 4 లో

వింటర్ సెషన్‌లో డీలిమిటేషన్..



న్యూఢిల్లీ :పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ తొలివారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లోనే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా కోటా బిల్లులను ఆమోదింపజేసుకోవాలని కేంద్రం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతున్నది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు వాడీవేడిగా సాగే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను నియోజకవర్గాల పునర్విభజన ద్వారా గరిష్ఠంగా 850కు పెంచాలని రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపాదిస్తున్నది. ఈ బిల్లు ఆమోదం ద్వారా 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్, శాసనసభల్లో మహిళలు 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. బిల్లులు గట్టెక్కేనా?: ప్రభుత్వంలోని కీలక వర్గాలతో చర్చించిన తర్వాత డిసెంబర్ మొదటి వారంలో సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాలు పీటీఐకి తెలిపాయి. అయితే ఈ కీలక బిల్లులు ఆమోదింపజేయడానికి అవసరమైన మెజారిటీ సాధించడం మోదీ సర్కార్‌కు సవాల్‌గా మారనుంది. మిగతా 3 లో

ట్యాపింగ్ కేసులో కీలక మలుపు.. గులాబీ నేతలకు షాక్!



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఏ1 గా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏ2గా పేర్కొంటూ ప్రత్యేక దర్యాప్తు బృందం తుది అదనపు ఛార్జ్‌షీట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.' వీరితో పాటు మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ నవీన్ రావుల పేర్లను కూడా ఈ ఛార్జ్‌షీట్‌లో చేర్చినట్లు సమాచారం. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో లో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, రాజకీయ ప్రత్యర్థులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారని సిట్ తన విచారణలో తేల్చినట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు సహా ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావు వంటి పోలీసు అధికారులను నిందితులుగా చేర్చిన సిట్, ఇప్పుడు రాజకీయ నాయకుల పాత్రపై దృష్టి సారించింది. 2 లో

పాలిటెక్నిక్‌పై యూటర్న్.. విద్యార్థుల ఆందోళనకు ప్రభుత్వం దిగొచ్చింది!



(హైదరాబాద్, సాక్షర): పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలను కార్మిక శాఖ పరిధిలోకి తీసుకొచ్చి.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జులైలో జీవో 97ను విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై పాలిటెక్నిక్ విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. వారి ఆందోళనలతో ప్రభుత్వం స్పందిస్తూ. 3 లో

గాజా విషయంలో నెతన్యాహు మోసం



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తన ఆత్మకథలో తీవ్ర ఆరోపణలు చేశారు. గాజా యుద్ధ సమయంలో పౌరుల ప్రాణనష్టాన్ని తగ్గిస్తామని నెతన్యాహు పదేపదే హామీ ఇచ్చి మాట తప్పారని బైడెన్ విమర్శించారు. ఇజ్రాయెల్ దీర్ఘకాలిక ప్రయోజనాల కంటే, తన స్వల్పకాలిక రాజకీయ అవసరాలకే నెతన్యాహు ప్రాధాన్యత ఇచ్చారని ఆయన దుయ్యబట్టారు. నవంబర్ 17న విడుదల కానున్న తన ఆత్మకథ 'ప్రామిస్ మీ, అమెరికా'లో బైడెన్ ఈ విషయాలను వెల్లడించారు. ఈ పుస్తకంలోని కొన్ని కీలక భాగాలను సీఎన్ఎన్ ప్రచురించింది. పూర్తిగా 2 లో

ఆత్మగౌరవం నినాదం వెనుక...



(హైదరాబాద్, సాక్షర): దివంగత నాయకుడు, ఉమ్మడి ఏపీకి దాదాపుగా ఎనిమిదిన్నరేళ్ళ పాటు పాలించి మూడు సార్లు ముఖ్యమంత్రి అయిన ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావడానికి కొన్ని కీలక పరిణామాలు ఆనాడు దారి తీశాయి. అందులో ముఖ్యమైనది ఆత్మ గౌరవం. తెలుగు వారికి ఆత్మగౌరవం అంతా ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెడుతున్నారు అని ఎన్టీఆర్ ఆనాడు ఉమ్మడి ఏపీ అంతా తిరిగి నలు చెరగులా ప్రచారం చేశారు. 4 లో

హైదరాబాద్ సదస్సులో 'ఓట్ చోర్' నినాదం.. ఇటలీ నేత వీసా నిబంధనలు ఉల్లంఘించారా?



హైదరాబాద్ : హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' అంటూ నినదించిన ఇటలీ రాజకీయ నాయకుడు జియాకోమో ఫిలిబెక్ వీసా నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆయన కాన్ఫరెన్స్ వీసాపై భారత్‌కు వచ్చారని తెలిపాయి. విదేశీ పౌరులు ఎలాంటి వీసాపై వచ్చినా భారత అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశాయి. నవంబర్ 13, 14 తేదీల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూరోపియన్ సోషలిస్టుల పార్టీ (పీఈఎస్) ప్రధాన కార్యదర్శి ఫిలిబెక్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రాచుర్యంలోకి తెచ్చిన 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' నినాదాన్ని వినిపించారు. పూర్తిగా 2 లో

మానవ మేధస్సును ఏఐ భర్తీ చేయలేదు.. అవసరమైన చోటే వినియోగించాలి



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ మానవ మేధస్సును పూర్తిగా భర్తీ చేయలేదని, మానవ మెదడు ఆలోచనా శక్తి, విచక్షణ, నిర్ణయ సామర్థ్యం ముందు ఏఐ ఒక సహాయక సాంకేతిక సాధనం మాత్రమేనని మాజీ సీబీఐ డైరెక్టర్ డాక్టర్ ఎం. నాగేశ్వరరావు, ఐపీఎస్ (రిటైర్డ్) అన్నారు. ఏఐను అవసరమైన చోట మాత్రమే వినియోగించుకోవాలని, మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా మార్చకూడదని సూచించారు. పూర్తిగా 3 లో

ఓటర్లకు ఈసీ భారీ ఊరట..



న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో పేర్లు గల్లంతైన పాత ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) భారీ ఊరటనిచ్చింది. గతంలో ఓటర్లుగా నమోదై ఉండి, ముసాయిదా జాబితాలో పేరు కనిపించకపోవడంతో తిరిగి నమోదు కోసం ఫామ్ 6 దాఖలు చేసినంత మాత్రాన ఎలాంటి విచారణ ఉండదని సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. గతంలో ఓటర్లుగా నమోదైనవారు ఫామ్ 6 సమర్పిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకుంటారనే ఆందోళనలు వ్యక్తమయ్యాయని ఈసీ తెలిపింది. అయితే, వారు మరే ఇతర లోక్‌సభ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లుగా నమోదు కాకూడదని, దరఖాస్తులోని ప్రకటన చట్టబద్ధంగా ఉండాలనే షరతు విధించింది. ఈ స్పష్టతను స్థానిక భాషల్లోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులను కోరింది. సర్ కు గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన, నకిలీ ఓటర్లుగా గుర్తించిన జాబితాలోని అర్హులను తిరిగి చేర్చాలని సుప్రీంకోర్టు చేసిన సూచననూ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. పూర్తిగా 3 లో

సంపాదకీయం

బ్యూరోక్రసిలో పాలిటిక్స్ ఇంతింతకాదయా..



సాధారణ రాజకీయాల్లో జరిగే ఎత్తులు, పైఎత్తులు బహిరంగంగానే కనిపిస్తాయి. కానీ బ్యూరోక్రసీ సర్కిల్‌లో సాగే రాజకీయాలు అంతకంటే ఎన్నో రెట్లు షార్ప్ గా ఉంటాయి. రాజకీయ నేతలు కూడా అలాంటి వ్యూహాలు పన్నరు. పైకి అత్యంత క్రమశిక్షణతో, నిబంధనల చట్రంలో కనిపించే అధికార యంత్రాంగంలో లోపల మాత్రం నిరంతరం ఒక అండర్ కరెంట్ ప్రవహిస్తూ ఉంటుంది. ఇక్కడ బహిరంగ విమర్శలు ఉండవు, నినాదాలు వినిపించవు కేవలం ఫైళ్ల కదలికలు, ఆమోద ముద్రలు, నిశ్శబ్ద బదిలీల రూపంలోనే ఆధిపత్య పోరు జరుగుతుంది. సాధారణ రాజకీయ నాయకులకంటే ఎక్కువ మేధస్సు, వ్యవస్థపై పూర్తి పట్టు ఉన్న వ్యక్తుల మధ్య సాగే ఈ చదరంగంలో, ఏ అడుగు ఎటువైపు పడుతుందో అంచనా వేయడం సామాన్యులకు సాధ్యం కాదు.ఈ అధికారిక వలయంలో ఒక అధికారికి వచ్చే ప్రజాదరణ ఒక్కోసారి ఆయనకే పెద్ద శాపంగా మారుతుంది. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడం, మీడియాలో హైలైట్ అవ్వడం , తన పరిధిలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం వంటివి తోటి అధికారుల్లోనూ, పైస్థాయి బాస్‌లలోనూ అసూయను, అభద్రతాభావాన్ని రగిలిస్తాయి. వ్యవస్థ కంటే వ్యక్తి పెద్దవాడు కాకూడదు అనే పాయింట్ బ్యూరోక్రసీలో బలంగా పనిచేస్తుంది. ఫలితంగా, అసాధారణ ప్రతిభ కనబరిచే అధికారులు, తమ పనితీరుతో ప్రజల మన్ననలు పొందేవారు సహజంగానే అంతర్గత రాజకీయాలకు ప్రధాన లక్ష్యంగా మారిపోతుంటారు.మరోవైపు, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులతో వ్యక్తిగత సాన్నిహిత్యం పెంచుకోవడం, పై అధికారులను బైపాస్ చేసి నేరుగా ముఖ్యమంత్రులు లేదా మంత్రులతో వ్యవహారాలు నడపడం తక్షణ ప్రయోజనాలను ఇవ్వొచ్చు. కానీ, ఈ షార్ట్ కట్ మార్గం దీర్ఘకాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. అధికార మార్పిడి జరిగినప్పుడో, లేదా ఆ రాజకీయ నాయకుడి ప్రాధాన్యత తగ్గినప్పుడో సదరు అధికారి పూర్తిగా ఏకాకి అవుతారు. అప్పటివరకు తాను విస్మరించిన పై అధికారుల ఆగ్రహానికి గురికావడమే కాకుండా, కొత్త ప్రభుత్వంలో పాత ప్రభుత్వ మనిషి అనే ముద్ర పడి ప్రాధాన్యత లేని పోస్టులకు పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బదిలీలు, పదోన్నతులు మరియు కీలక పోస్టింగ్‌ల విషయంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం వల్ల అధికారులు కొన్ని రాజకీయ పక్షాలకు అనుకూలంగా మారే అవకాశం ఉంటుంది. విభాగాల మధ్య సమన్వయ లోపం ఏర్పడటం, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం జరగడం, మరియు ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత లేదా విభాగ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి సమస్యలు తలెత్తుతాయి. సానుకూల ప్రభావాలు: వివిధ విభాగాల మధ్య జరిగే చర్చలు మరియు భిన్నాభిప్రాయాల వల్ల ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట పడుతుంది. అన్ని కోణాలను పరిశీలించిన తర్వాతే విధానాలు అమలవుతాయి.విధానపరమైన ఘర్షణలు: ప్రజాప్రతినిధులు తక్షణ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవాలని చూస్తే, అధికారులు నిబంధనలు మరియు దీర్ఘకాలిక పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వాటిని వ్యతిరేకించవచ్చు. సివిల్ సర్వీస్ అధికారుల మధ్య కూడా బ్యాచ్‌ల వారీగా (యాచింగ్), కేడర్ వారీగా లేదా భావజాలం ఆధారంగా అంతర్గత వర్గాలు ఏర్పడతాయి. ఒక వర్గానికి చెందిన అధికారికి ప్రాధాన్యత దక్కితే, మరొక వర్గం వ్యతిరేక వ్యూహాలు రచిస్తుంది. మంత్రులు వర్సెస్ అధికారులు: రాజకీయ నాయకులకు (మంత్రులకు), బ్యూరోక్రాట్లకు మధ్య నడిచే ఆధిపత్య పోరు నిత్యసత్యం. నిర్ణయాలు ఎవరి పేరుతో వెళ్లాలి, క్రెడిట్ ఎవరికి దక్కాలి అనే విషయంలో తెరవెనుక పెద్ద తతంగం నడుస్తుంది. సలహాల ద్వారా ప్రభావితం చేయడం: పాలసీల రూపకల్పనలో మంత్రులకు ఏది కావాలంటే అది అందించడం కంటే, తమకు ఇష్టమైన పాలసీ వైపు రాజకీయ నాయకులను మళ్లించడానికి అధికారులు వ్యూహాత్మకంగా నోట్స్ సిద్ధం చేస్తుంటారు.బ్యూరోక్రసీలో అతిగా మెరిసినా, అతిగా రాజకీయాలకు దగ్గరైనా అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.వ్యవస్థలోని నిబంధనలను, సీనియారిటీ మర్యాదలను గౌరవిస్తూ, తెరవెనుక ఉండి పనిచేసేవారే ఇక్కడ సుదీర్ఘకాలం మనుగడ సాగించగలరు. స్వతంత్ర నిర్ణయాల పేరిట హద్దులు దాటినా, రాజకీయ అండదండలతో పైవారిని ధిక్కరించినా, కాలం మారినప్పుడు ఆ అధికారికి రక్షణ కవచం ఉండదు. అందుకే, పరిపాలనా దక్షతతో పాటు ఈ అంతర్గత రాజకీయాల సమీకరణాలను అర్థం చేసుకోవడమే సివిల్ సర్వీసెస్‌లో అసలైన అగ్నిపరీక్ష!

మొదటి పేజీ తరువాయి తెలంగాణలో భూ రీసర్వేకు కొత్త విధానం

ఈ సమీక్షలో రీసర్వే మరియు గృహ పథకాల పురోగతిపై దృష్టి పెట్టారు.ప్రభుత్వం కొన్ని ప్రాంతాలు ఎస్‌వోపీ ప్రకారం రీసర్వేను సక్రమంగా నిర్వహిస్తున్నాయని గుర్తించింది. అయితే, ఇతర ప్రాంతాలలో స్థానిక పరిస్థితుల ఆధారంగా వేరు వేరు పద్ధతులు అనుసరించబడుతున్నాయి. మంత్రి క్షేత్రస్థాయి అధికారుల సూచనలు మరియు అనుభవాలను మార్పుల కోసం పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.కలెక్టర్లకు సమగ్ర భూ రీసర్వేను నిరంతరం పర్యవేక్షించమని ఆదేశించారు. రీసర్వే పూర్తయిన తర్వాత భూమి యజమానులకు అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సంబంధిత గ్రామాలలో ప్రతి 15 రోజులకు ఒక నోటీసు పంపించాలని సూచించారు.భూమి యజమానులకు ఎలాంటి సందేహాలు లేకుండా పూర్తి సమాచారం అందించాలి. ఆదాయ మరియు అటవీ భూముల సరిహద్దులను గుర్తించడంలో గందరగోళం నివారించడానికి అధికారులు మరియు కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 22ఏ భూముల గురించి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.కొన్ని జిల్లాలలో 22ఏ భూములకు సంబంధించిన సమస్యలు కొనసాగుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నల్గొండ మరియు ఖమ్మం జిల్లాల కలెక్టర్లు రీసర్వే నిర్వహణలో మెరుగైన పనితీరు చూపించడంతో ప్రశంసించబడ్డారు.నిజామాబాద్ జిల్లాలో సర్వే పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేయబడింది. కలెక్టర్లకు పనితీరు మెరుగుపరచాలని మరియు సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూ రీసర్వేను త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం సాంకేతిక వనరులను పెంచుతోంది.పాలేరు నియోజకవర్గాన్ని సమగ్ర రీసర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. పాలేరు నియోజకవర్గంలో 141 ఆదాయ గ్రామాలలో రీసర్వే జరుగుతోంది. రాష్ట్రంలో ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు మరియు రెండు రోవర్లు కేటాయించబడ్డాయి.మొత్తం 708 రోవర్లు సర్వే కోసం ఉపయోగించబడుతున్నాయి. ఒక వారం లోపు అదనంగా 400 రోవర్లు అందుబాటులోకి రానున్నాయి. సర్వే పనిని వేగవంతం చేయడం మరియు సరిహద్దుల గుర్తింపును మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యం.మంత్రి గృహ నిర్మాణ పథకాల గురించి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రెండు బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ స్థితిని సమీక్షిస్తున్నారు. గృహం కేటాయించడానికి అర్హులైన లబ్ధిదారులను వెంటనే గుర్తించాలి.ఇందిరమ్మ గృహ పథకం అర్హులైన పేద వ్యక్తులకు త్వరగా లాభం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, హనుమకొండ వంటి జిల్లాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూమిని గుర్తించమని కలెక్టర్లకు ఆదేశించారు. ప్రభుత్వానికి భూమి రీసర్వే ప్రక్రియలో మార్పులు చేయడం మరియు పేదలకు గృహం కోసం భూమిని గుర్తించడం ముఖ్యమైన లక్ష్యం.ఈ మార్పులు రీసర్వే ప్రక్రియలో ఎదురైన వ్యావహారిక సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించబడ్డాయి. ప్రభుత్వం రీసర్వే యొక్క సమర్థవంతమైన అమలుకు కట్టుబడి ఉంది. భూమి యజమానులతో సమయానికి సమాచారాన్ని అందించడం ముఖ్యమని మంత్రి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎస్‌వోపీ మార్పులు రీసర్వేలో సమర్థతను పెంచడానికి ఉద్దేశించబడ్డాయి. ప్రభుత్వానికి గృహ పథకాల కోసం భూమి గుర్తించడం ప్రాధమికత ఉంది.రీసర్వేలో పాల్గొనే వివిధ విభాగాల మధ్య సమన్వయం అవసరమని మంత్రి హైలైట్ చేశారు. ఈ మార్పులు భూ రీసర్వేలో సాఫీగా కార్యకలాపాలను సులభతరం చేయడానికి ఆశించబడుతున్నాయి. కొన్ని జిల్లాలలో కొనసాగుతున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

మొదటి పేజీ తరువాయి మానవ మేధస్సును ఏఐ భర్తీ చేయలేదు.. అవసరమైన చోటే వినియోగించాలి

జాతీయ పత్రికా దినోత్సవం – 2026 సందర్భంగా నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) ఆధ్వర్యంలో సోమవారం సికింద్రాబాద్‌లోని రెజొనెన్స్ కాలేజ్, కార్ఖానా క్యాంపస్‌లో "ఏఐ యుగంలో పత్రికా స్వేచ్ఛ (Freedom of Press in the AI Era)" అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నాగేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీడియా రంగంలో ప్రస్తుతం తీవ్ర పోటీ నెలకొందని, వార్తలను వేగంగా అందించాలనే పోటీలో వాస్తవాలు, విశ్వసనీయత, జర్నలిజం విలువలను విస్మరించకూడదని అన్నారు. ఏఐ వార్తల సేకరణ, విశ్లేషణ, రచన, ప్రసారంలో ఉపయోగపడుతున్నప్పటికీ మానవ ఆలోచనా శక్తి, అనుభవం, విచక్షణను భర్తీ చేయలేదని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల ఆధీనంలో మీడియా సంస్థలు.. నిష్పక్షపాత జర్నలిజం ఎలా సాధ్యం? మీడియా సంస్థల యాజమాన్య వ్యవస్థపై డాక్టర్ నాగేశ్వరరావు కీలక ప్రశ్నలు లేవనెత్తారు. అనేక మీడియా సంస్థలు రాజకీయ నాయకుల ఆధీనంలో లేదా రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తున్నప్పుడు, వాటి నుంచి నిష్పక్షపాతమైన, పారదర్శకమైన జర్నలిజాన్ని ఎలా ఆశించగలమని ప్రశ్నించారు. మీడియా సంస్థలు తమ యాజమాన్య ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, జర్నలిస్టులు వాస్తవాలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. చదివే ప్రతి వార్త నిజం కాకపోవచ్చు:

తొర్రూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



(డోర్నకల్, సాక్షర): పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యులు యశస్విన్ రెడ్డి , జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ , తొర్రూరు మున్సిపల్ చైర్మన్ శ్రావణ్ కుమార్ , ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో 'అక్వాన్' తుపాను..

- ఏపీ, తెలంగాణాలకు భారీ వర్ష సూచన
- బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- 'అక్వాన్' తుపానుగా మారే అవకాశం
- ఆంధ్రప్రదేశ్ తీరానికి తుపాను ముందస్తు హెచ్చరిక
- నవంబర్ 20, 21 తేదీల్లో తెలంగాణ తూర్పు జిల్లాలకు భారీ వర్ష సూచన
- ఉత్తర కోస్తాంధ్రలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం
- మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని అధికారులు ఆదేశం



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వేగంగా బలపడి 'అక్వాన్' తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ఈ తుఫాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రెండు రాష్ట్రాల అధికార యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం, నవంబర్ 15 సాయంత్రం 5:30 గంటల సమయానికి విశాఖపట్నానికి దక్షిణ-ఆగ్నేయంగా 920 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 16 సాయంత్రానికల్లా తుపానుగా, నవంబర్ 17 సాయంత్రం నాటికి తీవ్ర తుపానుగా మారనుందని ఐఎండీ అంచనా వేసింది. ఆ తర్వాత మరింత బలపడి నవంబర్ 19 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఈ సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం 145 కిలోమీటర్లకు చేరవచ్చని పేర్కొంది. ఏపీ, ఒడిశా తీరాలకు ముందస్తు హెచ్చరిక: తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న నేపథ్యంలో, ఏపీతో పాటు సమీపంలోని దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు ఐఎండీ ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. తుపాను తీరం దాటే ప్రదేశం, దాని కచ్చితమైన తీవ్రతపై రాబోయే ఒకటి, రెండు రోజుల్లో మరింత స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. ప్రస్తుత నమూనాల ప్రకారం, ఇది ఆంధ్రప్రదేశ్ తీరం వైపే పయనించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలంగాణపై వర్షాల ప్రభావం: తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని సమీపించిన తర్వాత దాని ప్రభావంతో తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా నవంబర్ 20, 21 తేదీల్లో తూర్పు తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులు వీయవచ్చని సూచించింది. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో నవంబర్ 21, 22 తేదీల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని అంచనా వేస్తున్నారు. కోస్తాంధ్రకు కుండపోత ముప్పు: కోస్తాంధ్రలో నవంబర్ 18 నుంచి వర్షాలు ప్రారంభమై, 19, 20 తేదీల్లో తీవ్రరూపం దాల్చనున్నాయి. ముఖ్యంగా ఉత్తర కోస్తాంధ్రలో అనేక చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు (21 సెం.మీ. లేదా అంతకంటే ఎక్కువ) కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఒడిశాలో కూడా నవంబర్ 19 నుంచి 21 మధ్య భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో బంగాళాఖాతంలో ఏర్పడుతున్న మూడో తుపాను ఇది. దీనికి ఇరాన్ సూచించిన 'అక్వాన్' అని పేరు పెట్టారు. సముద్రం అల్లకల్లోలంగా మారనున్నందున మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని, ఎవరూ వేటకు వెళ్లవద్దని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవాలని తూర్పు తెలంగాణ, కోస్తాంధ్ర రైతులను అప్రమత్తం చేశారు. తుపాను గమనం, తీవ్రతపై ఎప్పటికప్పుడు వెలువడే అధికారిక సమాచారాన్ని ప్రజలు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో మరో ఎన్‌కౌంటర్..





- పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాలో ఘటన
- ఆయుధం రికవరీ చేస్తుండగా పోలీసులపై కాల్పులు
- ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామన్న పోలీసులు
- నేరగాళ్లకు రాష్ట్రంలో స్థానం లేదన్న సీఎం సువేందు అధికారి

(బర్ధమాన్, సాక్షర): పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై కాల్పులు జరిపిన కేసులో నిందితుడిగా ఉన్న హిస్టరీ షీటర్, పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. బీర్‌భూమ్ జిల్లా నానూర్‌లోని ఓ ఇటుక బట్టీ వద్ద ఆదివారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. రతన్ షేక్ అనే హిస్టరీ షీటర్‌ను అరెస్ట్ చేసేందుకు నవంబర్ 13న శాంతినికేతన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాయిక్ బజార్ వద్ద పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో నిందితుడు పోలీసులపై కాల్పులు జరపగా, కానిస్టేబుల్ బిశ్వజిత్ దాస్ ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. అనంతరం షేక్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన కానిస్టేబుల్‌ను మొదట బోల్‌పూర్ ఆసుపత్రికి, ఆ తర్వాత బర్ధమాన్ మెడికల్ కాలేజీకి తరలించారు. ఈ ఘటన తర్వాత పరారీలో ఉన్న రతన్ షేక్‌ను పోలీసులు ఆదివారం పక్కనే ఉన్న పుర్బా బర్ధమాన్ జిల్లాలోని నవాబ్‌హట్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. కానిస్టేబుల్‌పై కాల్పులకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకునేందుకు అతడిని నానూర్‌లోని ఇటుక బట్టీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ దాచిపెట్టిన ఆయుధాన్ని బయటకు తీసిన షేక్, మరోసారి పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరపగా, షేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నానూర్‌లోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంత్ర గ్రామ నివాసి అయిన షేక్‌పై దొంగతనం, దోపిడీ, నార్కోటిక్స్ వంటి పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పందించారు. "పోలీసులపై ఎవరైనా కాల్పులు జరిపితే, వారికి పోలీసులు స్వీట్లు పంచాలా? రాష్ట్రంలో నేరగాళ్లకు స్థానం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన గత ఆరు నెలల్లో రాష్ట్రంలో ఇది ఐదో పోలీస్ ఎన్‌కౌంటర్ కావడం గమనార్హం.

హైదరాబాద్ పై చలి పంజా..

హైదరాబాద్:తెలంగాణలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యు)లో అత్యల్పంగా 11.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో 13.4 డిగ్రీలుగా నమోదైంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ చలి ప్రభావం అధికంగా ఉంది. తిర్యానిలో 12, కెరమెరిలో 13.3, వాంకిడిలో 13.7, జైనూర్, కాగజ్‌నగర్, రెబ్బెనలో 14.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాప్రా, చార్మినార్‌లో 13.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. పటాన్‌చెరులో 13.8, అమీర్‌పేట, శేరిలింగంపల్లిలో 14.1 డిగ్రీలు నమోదయ్యాయి. నగరంలో సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నాయని, జీహెచ్ఎంసీ పరిధిలో మరో 10 రోజుల పాటు ఇదే తరహా వాతావరణం కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పొడి వాతావరణం మరికొన్ని రోజులు కొనసాగనుండగా, ఉదయం వేళల్లో పొగమంచు కమ్మేస్తుండటంతో ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి ప్రధాన బస్ స్టేషన్లలో ఉదయం ప్రయాణికుల రద్దీ తగ్గింది. చలి తీవ్రత దృష్ట్యా పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాతావరణ మార్పుల వల్ల ఈ నెల 20 తర్వాత రాష్ట్రంలో

మొదటి పేజీ తరువాయి వింటర్ సెషన్‌లో డీలిమిటేషన్..

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుత 543 స్థానాల్లో కనీసం 361 మంది సభ్యుల మద్దతు ఉండాలి. ప్రస్తుతం 3 స్థానాలు ఖాళీగా ఉండటంతో సభ్యుల సంఖ్య 540గా ఉన్నది. అధికార ఎన్డీయే కూటమికి 320 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నది. దీంతో బిల్లు గట్టెక్కాలంటే విపక్షాల మద్దతు తప్పనిసరి. మరోవైపు, సర్‌కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేసిన విపక్షాలు.. ప్రధాన ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిరసనలు పార్లమెంట్‌లో కొనసాగే అవకాశం ఉన్నది. దీంతో శీతాకాల సమావేశాలు మరోసారి గందరగోళంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సభ సజావుగా సాగితేనే రాజ్యాంగ బిల్లుపై చర్చ, ఓటింగ్ సాధ్యమవుతుందని అధికార కూటమికి చెందిన ఓ ఎంపీ అభిప్రాయపడ్డారు. అయితే బిల్లుకు అవసరమైన మద్దతు లభిస్తుందనే నమ్మకంతో ప్రభుత్వం ఉన్నది. ఈ బిల్లు 15-18 ఓట్ల ఆధిక్యంతో గట్టెక్కుతుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నట్లు తెలిసింది. ప్రొరోగ్ చేయకుండా..: ఇదిలా ఉండగా, వర్షాకాల సమావేశాలు అధికారికంగా ప్రొరోగ్ చేయకుండా ప్రభుత్వం కొనసాగించడం కూడా తాజా సమావేశాల తేదీలపై ఊహాగానాలకు తెరలేపింది. ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయితే వాటిని అధికారికంగా ముగించకపోవడంతో ఇప్పటికి 94 రోజులు గడిచాయి. 2008 నమోదైన 87 రోజుల రికార్డును ఇది అధిగమించింది. ఈ విధానం ద్వారా అవసరమైతే ప్రస్తుత సమావేశాలనే పొడిగించి లేదా ప్రత్యేకంగా సమావేశమై రాజ్యాంగ సవరణ బిల్లును తక్కువ సమయంలోనే చేపట్టే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కొనసాగుతున్న సమావేశాలను పొడిగించాలంటే కనీసం రెండు రోజుల ముందుగా నోటీసు ఇవ్వాలి. కొత్త సమావేశాలను ఏర్పాటు చేయాలంటే కనీసం 14 రోజుల ముందుగా నోటీసు అవసరం. 50 శాతం చొప్పున పెంపు!: ముఖ్యంగా డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలను తగ్గించేందుకు కేంద్రం ఓ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను 50 శాతం చొప్పున పెంచాలని యోచిస్తున్నది. అదే సమయంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న స్థానాల నిష్పత్తిని కొనసాగించే ఫార్ములాను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ ఏడాది ఏప్రిల్ 17న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ అవసరమైన మెజారిటీ లభించకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. దీంతో శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లు భవితవ్యం కేంద్ర ప్రభుత్వానికి కీలక రాజకీయ , శాసనపరమైన పరీక్షగా మారనుంది. కాగా, సభ నిరవధికంగా వాయిదా పడిన తర్వాత ఎన్ని రోజుల్లో ప్రొరోగ్ చేయాలనే దానిపై రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు విధించలేదు.

కార్తీక మాసం..తొలి సోమవారం..

- శివనామస్మరణతో మార్మోగుతున్న శైవక్షేత్రాలు

(విజయవాడ, సాక్షర): పవిత్రమైన కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే నదులు, పవిత్ర జలాల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వశిష్ఠగోదావరి నదిలోనూ, పాలకొల్లు క్షీరారామ క్షేత్రంలోనూ భక్తుల తాకిడి భారీగా కనిపిస్తోంది. శ్రీశైల మహాక్షేత్రంలో మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాజమండ్రి పుష్కర ఘాట్లలోనూ భక్తులు పెద్దఎత్తున నదీ స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు వెలిగిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. శివాలయాలన్నీ శివయ్య నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసం..తొలి సోమవారం.. శివనామస్మరణతో మార్మోగుతున్న శైవక్షేత్రాలుహిందూ ధర్మంలో కార్తీకమాసానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా ఈ మాసంలో వచ్చే ప్రతి సోమవారం పరమశివునికి అత్యంత ప్రీతికరమైనదిగా భావిస్తారు. ఈ నేపథ్యంలో కార్తీక మాసపు మొదటి సోమవారం కావడంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తుల శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు నదులకు చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరిస్తూ కార్తీక దీపాలను వెలిగిస్తున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక శోభ పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నరసాపురం వశిష్ఠ గోదావరి నదిలో భక్తులు తెల్లవారుజామునుంచే పుణ్యస్నానాలు ఆచరించి, నదిలో కార్తీక దీపాలు వదిలి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇక పంచారామ క్షేత్రాలలో ఒకటైన పాలకొల్లు శ్రీ క్షీర రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరారు. క్షీర రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి.అలాగే రాజమండ్రిలోనూ కార్తీక శోభ సంతరించుకుంది. గోదావరి పుష్కర ఘాట్‌లు భక్తులతో కళకళలాడుతున్నాయి. కోటిలింగాల ఘాట్ వద్ద ఉన్న కోటిలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు, ఉమామార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నదీ తీర ప్రాంతాల్లో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. శ్రీశైల మహాక్షేత్రంలో భారీ రద్దీ ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల మల్లన్న ఆలయానికి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామునే పాతాళగంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. గంగాధర మండపం, ఉత్తర శివమాడ వీధిలో కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలు చాటుకుంటున్నారు. మహాక్షేత్రం భక్తుల రద్దీతో పూర్తిగా సందడిగా మారింది. నిన్న ఒక్కరోజే స్వామి అమ్మవార్లను 48,557 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం తగిన ఏర్పాట్లు చేసింది. అంతేకాకుండా, ఈనెల 24న శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో ఘనంగా కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.కార్తీక తొలి సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ దీపాల కాంతులతో, వేదమంత్రోచ్ఛారణలతో దివ్యసౌందర్యాన్ని సంతరించుకున్నాయి. ప్రతి శివాలయం వద్ద భక్తుల కోలాహలం కనిపిస్తోంది. శివ భక్తులు ఈ పవిత్ర మాసంలో నియమనిష్ఠలతో పూజలు చేస్తూ దైవకృపను పొందుతున్నారు.

మొదటి పేజీ తరువాయి గాజా విషయంలో నెతన్యాహు మోసం

అక్టోబర్ 7, 2023న హమాస్ దాడుల తర్వాత ప్రారంభమైన గాజా యుద్ధంలో, పౌరుల ప్రాణనష్టాన్ని తగ్గించాలని తాను నెతన్యాహును పలుమార్లు కోరినట్లు బైడెన్ తెలిపారు. "పౌర మరణాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చేవారు. కానీ ఆ తర్వాత మరింత మంది పౌరులు ప్రాణాలు కోల్పోయేలా దాడులు జరిగేవి. నిలబెట్టుకోలేని హామీలు ఇవ్వడంలో నెతన్యాహుకు ఎలాంటి సంకోచం లేదు," అని బైడెన్ తన పుస్తకంలో రాశారు. హమాస్ దాడుల తర్వాత ఇజ్రాయెల్‌కు అండగా నిలిచినందుకు తాను ఎన్నటికీ చింతించనని బైడెన్ స్పష్టం చేశారు. అయితే, ఆ యుద్ధంలో అపారమైన సంఖ్యలో అమాయక పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఒక రాజనీతిజ్ఞుడిలా ఆలోచించడంలో నెతన్యాహు విఫలమయ్యారని, ఆయన తీరు కొన్నిసార్లు డొనాల్డ్ ట్రంప్‌ను గుర్తుకు తెచ్చేదని బైడెన్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ ఆరోపణలపై నెతన్యాహు కార్యాలయం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

జాతీయ పత్రికా దినోత్సవం

- జర్నలిస్టులకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

(హైదరాబాద్, సాక్షర): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పాత్రికేయులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, బాధ్యతాయుత జర్నలిజం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించి, చైతన్యవంతులను చేస్తూ, సమాజంలో జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో పత్రికా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా, ప్రజల గొంతుకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి నిత్యం అనేక సవాళ్లు, ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ సత్యాన్వేషణలో వెనుకడుగు వేయకుండా, ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం..

- సాయంత్రానికి తుపానుగా.. శుక్రవారం అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం!

ఆగ్నేయ, ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం గత ఆరు గంటల్లో గంటకు 17 కి.మీ. వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 650 కి.మీ., విశాఖపట్నానికి 730 కి.మీ., గోపాల్‌పూర్‌కు 850 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తీవ్ర వాయుగుండం సోమవారం సాయంత్రానికి తుపానుగా, మంగళవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నానికి అతి తీవ్ర తుపానుగా మారి నెల్లూరు-తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ప్రజలు, రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ సూచించారు.

మొదటి పేజీ తరువాయి ట్యాపింగ్ కేసులో కీలక మలుపు.. గులాబీ నేతలకు షాక్!

విచారణ సందర్భంగా పోలీసు అధికారులు ఇచ్చిన వాంగ్మూలాలు, సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలు , బాధితుల స్టేట్‌మెంట్లను క్రోడీకరించి సిట్ ఈ నివేదికను రూపొందించినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.అంతేకాకుండా, ఈ ఛార్జ్‌షీట్ న్యాయస్థానంలో బలంగా నిలబడేలా ఢిల్లీలోని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదుల న్యాయ సలహాలను కూడా దర్యాప్తు అధికారులు తీసుకుంటున్నారు.మరోవైపు, ఈ పరిణామాలకు బలం చేకూరుస్తూ రెండు రోజుల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ—ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుందని, త్వరలోనే సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని హింట్ ఇచ్చారు.ఈ వ్యాఖ్యలు చేసిన 48 గంటల్లోనే కేసీఆర్, కేటీఆర్‌ల పేర్లతో ఛార్జ్‌షీట్ సిద్ధమైందన్న వార్తలు రావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. 2024 మార్చిలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా సాగిన సుదీర్ఘ విచారణలో, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వంటి నేతలను కూడా సాక్షులుగా విచారించి వారి వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది.ఒకవైపు దర్యాప్తు సంస్థలు సేకరించిన సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలతో కూడిన తుది ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించేందుకు సిద్ధమవుతుండగా, మరోవైపు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ దీనిని రాజకీయ కక్ష సాధింపు చర్యగా అభివర్ణిస్తోంది. ట్యాపింగ్ కేసు ఆధారాలు లేవని వాదిస్తోంది. తుది ఛార్జ్‌షీట్ అధికారికంగా కోర్టులో దాఖలైన తర్వాతే ఇందులోని అభియోగాలు, తదుపరి న్యాయపరమైన చర్యలపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మొదటి పేజీ తరువాయి ఓటర్లకు ఈసీ భారీ ఊరట..

నవంబర్ 6న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఓటర్లు తమ నివాస ప్రాంతానికి సంబంధించిన ఈఆర్ వో, ఏఈఆర్ వో లేదా బీఎల్ వోకు ఎన్యుమరేషన్ ఫామ్ సమర్పించవచ్చు. గతంలో ఫామ్ ఇవ్వకపోవడానికి గల కారణాన్ని అనుబంధం-బీలో పేర్కొనాలి. స్వయంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా దీనిని అందించవచ్చు. ఈసీఐనెట్ లో ఈ-సైన్‌తో ఆన్‌లైన్ సమర్పణకూ అవకాశం కల్పించింది. అదే సమయంలో డూప్లికేట్ నమోదులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఈసీ ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను కాపాడటం తమ రాజ్యాంగబద్ధ బాధ్యతని పేర్కొంది. ఎస్ఐఆర్ చట్టబద్ధమైన ప్రక్రియేనని, కమిషన్ ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని గతంలోనే సుప్రీంకోర్టుకు తెలిపింది. ఫామ్ 6 లో ఎలాంటి మార్పులు చేయలేదని కూడా స్పష్టం చేసింది.

ఈ నెల 22న అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవ వేడుకలు

- స్వర్ణోత్సవ కమిటీ ఛైర్మన్ మామిడిపల్లి బాపయ్య



(పెద్దపల్లి, సాక్షర): ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 22న జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని స్వర్ణోత్సవ కమిటీ ఛైర్మన్, సంఘం జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య పిలుపునిచ్చారు. పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చారిత్రాత్మక వేడుకల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని సంఘం నాయకులు, సభ్యులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్, రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి పురపాలక సంఘం ఛైర్మన్ నూగిళ్ల మల్లయ్య,ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణతో పాటు మాజీ శాసనసభ్యులు, పలు రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరవు తున్నట్లు వెల్లడించారు. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సంఘం బలోపేతానికి కృషి చేస్తున్న సుమారు వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక జ్ఞాపికలు అంద జేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్వర్ణోత్సవ కమిటీ కన్వీనర్ మైస రాజేష్,వైస్ ఛైర్మన్ లంక సదయ్య, సమన్వయకర్త కుక్క అశోక్, కో-కన్వీనర్ పొనుగంటి రాజనర్సు, సంఘం రాష్ట్ర కార్యనిర్వా హక అధ్యక్షుడు బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, జిల్లా నాయకులు గుట్ట లింగయ్య, చొప్పదండి మల్లేశం, సంకెనపల్లి లక్ష్మయ్య, నక్క శంకరయ్య, బొల్లి నందయ్య, భూపెల్లి మల్లేశం, బాదె వెంకటేష్, బూడిద సమ్మయ్య,చుంచు మల్లేష్, కాసిపేట పోచయ్య, పెరక బానేష్, బోసెల్లి నారాయణ, కాంపల్లి నరసయ్య, గొట్టే రాజయ్య, కన్నూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి ఆత్మగౌరవం నినాదం వెనుక...

అది వజ్రాయుధంగా మారి అప్పటికి మూడు దశాబ్దాల పైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో కూల్చివేసింది. అలా పార్టీ పెట్టిన తొమ్మిది నెలలలోనే టీడీపీ అధికారం అందుకుంది అంటే దాని వెనక అంతటి పవర్ ఫుల్ నినాదం ఉంది అన్న మాట మళ్ళీ ఇన్నాళ్ళకు ఆ నినాదం బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నోట వినిపిస్తోంది. తాజాగా ఆయన పార్టీ సమావేశాలలో మాట్లాడుతూ కాంగ్రెస్ బీజేపీ నేతలు ఇద్దరూ ఢిల్లీలో వారి పార్టీ అధినేతల ముందు తల వంచుతున్నారని ఘాటు కామెంట్స్ చేశారు. ఢిల్లీ వెళ్ళిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నది లేకుండా కాంగ్రెస్ అగ్ర నేతల ముందు భయపడిపోతున్నారని నిందించారు. ఇది తెలంగాణా ఆత్మ గౌరవం కాదా అన్నారు. కేంద్ర మంత్రిగా ఉంటూ : తెలంగాణకు కేంద్ర మంత్రి అమిత్ షా వస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆయనకు దారి సరి చేస్తూ పాదయాత్రలో వ్యవహరించిన తీరుని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. అసలు రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా బండి సంజయ్ కి కేంద్ర మంత్రిగా తాము ఉన్నామని గమనించుకోవాలని ఆయన సూచించారు. బీజేపీ అయినా కాంగ్రెస్ అయినా అగ్ర నేతలు తెలంగాణా నాయకులను తగ్గించి చూస్తున్నారు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నారు అని అన్నారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీగా బీజేపీ చెప్పులు మోసే పార్టీగా మారిందని హాట్ కామెంట్స్ చేశారు. : తెలంగాణా ఆత్మ గౌరవం నిలబెట్టాలీ బీఆర్ఎస్ మాత్రమే ఉండాలని ఆయన అన్నారు. ఢిల్లీ పాలకులను నిలదీయాలంటే బలమైన ప్రాంతీయ పార్టీల అవసరం అని ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణా ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే జాతీయ పార్టీలను అంతా వ్యతిరేకించాలని కేటీఆర్ కోరారు. ఆయన అలా నినదించడం ఇపుడు కొత్త చర్చకు దారి తీస్తోంది. తెలంగాణాలో రెండు జాతీయ పార్టీల మధ్యలో బీఆర్ఎస్ అనే ప్రాంతీయ పార్టీ ఉంది. ఆ రెండు జాతీయ పార్టీలు ప్రజలకు మేలు చేయలేవని ప్రచారం చేస్తూ వచ్చిన బీఆర్ఎస్ ఇపుడు రూట్ మార్చింది అని అంటున్నారు. ఆత్మ గౌరవ నినాదం తీసుకుని వస్తోందని గుర్తు చేస్తున్నారు. ఈ నినాదం ఎన్టీఆర్ టీడీపీకి ఇంధనంగా పనిచేసింది. అదే తీరున బీఆర్ఎస్ జనంలోకి వెళ్లాలని చూస్తోందా అన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్ర సాధన అంతా నీరు నిధులు నియామకాలతో పాటు ఆత్మ గౌరవ పోరాటం మీదనే ఆధారపడి సాగింది. అందుకే బీఆర్ఎస్ మరోసారి ఈ నినాదానికి పదును పెడుతోంది అని అంటున్నారు. అయితే హైకమాండ్ కి జవాబు దారీగా ఉండడంలో తప్పేంటి అని కాంగ్రెస్ బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. వక్ర భాష్యాలు బీఆర్ఎస్ చేస్తోంది అని విమర్శిస్తున్నాయి

మొదటి పేజీ తరువాయి కౌశిక్ రెడ్డికి హైకోర్టులో షాక్...

దీంతో పోలీసుల దర్యాప్తులో భాగంగా కౌశిక్‌రెడ్డి వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. కరీంనగర్ సీపీని దూషించినట్లు వచ్చిన ఆరోపణలపై పాడి కౌశిక్‌రెడ్డిపై వీణవంక పోలీస్ స్టేషన్‌లో గతంలో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా ఆయన వాయిస్ శాంపిల్ సేకరించాలని పోలీసులు నిర్ణయించారు. ఇందుకోసం కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు.అయితే వీణవంక పోలీసులు ఇచ్చిన నోటీసులను పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. తాను సీపీని దూషించలేదని.. ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేసి తనపై కేసు నమోదు చేశారని తన పిటిషన్‌లో పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు లాయర్ తన వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తులో భాగంగా నిబంధనల ప్రకారమే పోలీసులు వాయిస్ శాంపిల్స్ సేకరించేందుకు నోటీసులు జారీ చేశారని కోర్టుకు వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో వాయిస్ శాంపిల్ సేకరణకు సంబంధించి పోలీసులు తదుపరి చర్యలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది.కరీంనగర్ జిల్లా వీణవంకలో జరిగిన మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ఈ వివాదం చోటుచేసుకుంది. జాతరకు పరిమిత సంఖ్యలో వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని పోలీసులు సూచించగా.. పాడి కౌశిక్‌రెడ్డి భారీ కాన్వాయ్‌తో రావడంతో వివాదం తలెత్తినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారని.. అప్పటి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌తో వాగ్వాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. కమిషనర్‌పై మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.మరోవైపు.. మేడారం జాతరలో మొక్కులు చెల్లించుకోకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు అప్పట్లో ఆరోపించారు. ఈ నేపథ్యంలో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పుడు వాయిస్ శాంపిల్ అంశం తెరపైకి వచ్చింది. హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేయడంతో కౌశిక్‌రెడ్డి వాయిస్ శాంపిల్ సేకరణకు సంబంధించి పోలీసులు ముందుకు వెళ్లే అవకాశం ఉంది. వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన గొంతుతోనే చేశారా లేదా అన్నది నిర్ధారించేందుకు ఈ శాంపిల్‌ను దర్యాప్తులో భాగంగా పరిశీలించనున్నారు. ఈ పరిణామం బీఆర్ఎస్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది

మొదటి పేజీ తరువాయి హైదరాబాద్ సదస్సులో 'ఓట్ చోర్' నినాదం.. ఇటలీ నేత వీసా నిబంధనలు ఉల్లంఘించారా?

దేశ ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఈ నినాదం కేంద్రంగా ఉంది. సదస్సు లేదా సెమినార్ లేదా వర్క్‌షాప్‌లో పాల్గొనడమే ప్రధాన ఉద్దేశంగా భారత్‌కు వచ్చే విదేశీయులకు కాన్ఫరెన్స్ వీసా జారీ చేస్తారు. ఫిలిబెక్ ఈ-వీసా పోర్టల్ ద్వారా ఈ వీసా పొందినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత అంతర్గత రాజకీయాల్లో వ్యాఖ్యలు చేయడం వీసా నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నాయి. రాహుల్ గాంధీ 'ఒక వ్యక్తి.. ఒక ఓటు' అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిలిబెక్ వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాల్లో పారదర్శకత కోసం ఆయన చేస్తున్న ప్రచారాన్ని సమర్థించారు. రామలీలా మైదానంలో ఇటీవల జరిగిన ర్యాలీని ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్యాన్ని ప్రజలే కాపాడుకోవాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమావేశాల ద్వారా ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లవచ్చని తాను పాల్గొనడాన్ని సమర్థించుకున్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత అంతర్గత వ్యవహారాలపై విదేశీ రాజకీయ నాయకుడు మాట్లాడటమేంటని ప్రశ్నించారు. సదస్సులో ఫిలిబెక్ నినాదాలు చేసినప్పుడు రాహుల్ గాంధీ నవ్వుతూ చప్పట్లు కొట్టడం కూడా వివాదానికి దారితీసింది. అంతర్జాతీయ వేదికలపై భారత్, ప్రజాస్వామ్య సంస్థల ప్రతిష్ఠను రాహుల్ గాంధీ దెబ్బతీస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. విదేశీ ప్రతినిధుల ముందు ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని తొలగించాలని కోరుతున్నారని బీజేపీ ఆరోపించింది. విదేశీ శక్తులతో కలిసి భారత ప్రజాస్వామ్యంలో జోక్యానికి రాహుల్ ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత కార్తిక్ ఇంద్రారెడ్డి పల్లొల్ల కూడా విదేశీ నాయకుడి వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రోత్సహించడంపై ప్రశ్నలు లేవనెత్తారు. మరోవైపు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఫిలిబెక్ వ్యాఖ్యలను సమర్థించారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో ప్రధాని మోదీ మాట్లాడుతున్నప్పుడు.. ఇటలీ నాయకుడు భారత్ గురించి మాట్లాడకూడదా? అని బీజేపీ విమర్శలను ప్రశ్నించారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి -జిల్లా కలెక్టర్ కె.హరిత



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) ప్రజావాణిలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణం నౌగాం బస్తీకి చెందిన మోతే పోచమ్మ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణం నూర్ నగర్ కు చెందిన పాటిల్ జగన్నాథ్ తన ఆస్తిని తన పిల్లలు మొత్తం తీసుకొని, తన పోషణ పట్టించుకోవడం లేదని, తన ఆస్తిని తనకు అప్పగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం బెండార గ్రామానికి చెందిన వేములవాడ హారిక తనకు ఆశా వర్కర్ గా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ -యు మండలం పాములవాడ గ్రామానికి చెందిన ఆత్రం అర్జుబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ పట్టణం బాలాజీ నగర్ కు చెందిన గజ్జల పెళ్లి స్వప్న తనకు రెండు పడక గదుల ఇల్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం చౌపన్ గూడ గ్రామానికి చెందిన గిరిజనులు తమ వ్యవసాయ భూములకు బావులు, బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామానికి చెందిన మేకార్తి గోపాల్, తనకు తన తండ్రి నుండి వచ్చిన భూమిని సమానంగా పంచి ఇవ్వలేదని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పిల్లల ప్రజావాణిలో ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామానికి చెందిన విద్యార్థులు తమ గ్రామంలో గల తెలంగాణ సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం, త్రాగునీరు, వంటశాల, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతల మానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన దుర్గం అచ్యుతవల్లి అనే 6వ తరగతి విద్యార్థిని తనకు కరీంనగర్ జిల్లా చింతకుంట లో గల సాంఘిక సంక్షేమ పాఠశాలలో సీటు వచ్చిందని, తనకు దూరము అవుతున్నందున జిల్లాలో ఏదైనా గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లల ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు తమ సెల్ ఫోన్ ద్వారా రినివల్ చేసుకోవచ్చు



(రెబ్బెన, సాక్షర): ఇకపై పెన్షన్, రినివల్ మీసేవా కేంద్రాల్లో మాత్రమే కాకుండా విశ్రాంత ఉద్యోగులు తమ సెల్ ఫోన్ ద్వారా చేసుకోవచ్చని సీఎంపీఎఫ్ అధికారులు వివరించారు.డిజిటల్ సర్టిఫికేట్ కాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ (కోల్ మైన్స్ పెన్షన్) రినివల్ చేసుకోవడం పట్ల గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో సీఎంపీఎఫ్ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు.పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రినివల్ చేసుకోవడంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా సెల్ ఫోన్ లో పలువురు ఉద్యోగులు జీవన్ ప్రమాణ్ రినివల్ చేసి చూపించారు.కార్యక్రమంలో సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్, డీజీఎం పర్సనల్ దేవరకొండ కిరణ్ బాబు, ఎస్ఓ టు జీఎం ఇ స్వామిరాజు, సీనియర్ పర్సనల్ అధికారి రజినికుమార్, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి హరీష్ రావు చేసిన అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందే

తప్పు చేసిన వారెవరైనా సరే కచ్చితంగా వారికి శిక్ష పడాలన్నదే తమ విధానమన్నారు. ◆ మోడీని కలిసి కరువు గురించి మాట్లాడరా?:- ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో కరువు పరిస్థితులుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత మండిపడ్డారు. నిన్న ప్రధాని మోడీని కలిసిన ఆయన కనీసం ఈ అంశంపై మాట్లాడకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో కరువు, రైతుల బాధలు, పంటల పరిస్థితిని ప్రధానికి వివరించి సాయం కోరాలన్న సోయి కూడా సీఎం కు లేదన్నారు. పెండింగ్ లో ఉన్న బీసీ బిల్లు గురించి కూడా ప్రధానితో ప్రస్తావించకపోవటం అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రజలకు సంబంధించిన అంశాలను పక్కన పెట్టి కేవలం కాంట్రాక్ట్ లు, కమీషన్ల గురించి మాట్లాడుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, తెలంగాణ వచ్చిన తర్వాత గానీ రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని చెప్పారు. పంటలు వేయకపోతే రైతులకు ఏం పరిహారం ఇస్తారో చెప్పాలన్నారు. ఎకరాకు రూ. 25 వేలు పరిహారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ◆ త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా బైరవ వాహనంలో యాత్ర:- తమ పార్టీ ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందాలన్న సంకల్పంతో ఉందని, అదే విధంగా సామాజిక న్యాయం ప్రతి వర్గానికి అందాలన్నదే తమ అభిమతమని చెప్పారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా బైరవ వాహనంలో త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపడతామన్నారు. నిరుద్యోగులను మోసం చేసి కనీసం జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించని కాంగ్రెస్ కు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రతిపక్షం బీఆర్ఎస్, బీజేపీ లు కాంగ్రెస్ ను ప్రశ్నించకుండా కాలం వెళ్లదీస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల్లో చైతన్య శక్తి ని నింపేలా తాము కృషి చేస్తున్నామని గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇంటర్మీడియేట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని..దానిపై మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు.

19 నుంచి 'ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం' క్యాంపులు: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి 'ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం' పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం' అమలుకు సంబంధించిన క్యాంపుల నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం కార్యక్రమం జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభమై ఒక నెల రోజుల పాటు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం పకడ్బందీ అమలుకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని, క్యాంపుల నిర్వహణలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి లేదా వార్డుకు ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. అలాగే, మూడు లేదా నాలుగు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక ప్రత్యేక అధికారిని పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేయడంతో పాటు, మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాల్సి ఉంటుందని అధికారులకు సూచించారు. దరఖాస్తు ప్రక్రియలో ఫారమ్‌లలో రేషన్ కార్డు డేటా ఆటోమేటిక్‌గా వస్తుందని, ఆ సమాచారం ఉన్నవారి వద్ద కేవలం నామినీ వివరాలు నమోదు చేసి, లబ్ధిదారుల నుంచి సంతకం తీసుకొని ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అయితే, నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో లేదా ఫారమ్‌లో వివరాలు రాని పక్షంలో, భౌతికంగా ఫారమ్‌లను ప్రింట్ తీసుకుని, వాటిపై లబ్ధిదారుల నుంచి సంతకాలు సేకరించాలని ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్డీఓ రవీందర్, జెడ్పీ సీఈఓ రవి, డిపిఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ దుర్వినియోగానికి చెక్ పెట్టండి..

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి చిరంజీవి వినతి



(హైదరాబాద్, సాక్షర): ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నకిలీ గుర్తింపులకు వ్యతిరేకంగా మరింత పటిష్ఠమైన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని మెగాస్టార్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సలహా మేరకు కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించిన ఫొటోలను సోషల్ మీడియాలో మెగాస్టార్ పంచుకున్నారు. ఈనెల 2 హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తనయుడు రామ్ చరణ్‌తో కలిసి చిరంజీవి సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సమయంలో డీప్‌ఫేక్ ముప్పుపై అమిత్ షాతో చర్చించినట్లు చిరంజీవి వెల్లడించారు. ఆయన సూచన మేరకే కేంద్ర హోంశాఖ, సమాచార, ప్రసార శాఖలను ఉద్దేశించి రూపొందించిన వినతిపత్రాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అందజేసినట్లు తెలిపారు. ఈ అంశాలపై సంబంధిత మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ముందుకు తీసుకువెళ్తామని హామీ ఇచ్చిన కిషన్‌రెడ్డికి చిరంజీవి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి పౌరుడి భద్రతతో పాటు, కళాకారుల గౌరవం, గుర్తింపు, సృజనాత్మక హక్కులను పరిరక్షించడం ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. సాంకేతికత సృజనాత్మకతను పెంపొందించాలే తప్ప.. వ్యక్తుల గౌరవానికి భంగం చేయకూడదని తన ఎక్స్ పోస్టులో చిరంజీవి అభిప్రాయపడ్డారు.

శబరిమలలో ప్రారంభమైన వార్షిక మండల-మకరవిళక్కు యాత్ర



- మంగళవారం వేకువజాము నుంచే అయ్యప్ప దర్శనానికి భక్తుల అనుమతి
- రోజుకు 80 వేల మంది దర్శించుకునేలా ఆలయ బోర్డు ఏర్పాట్లు
- పంబ, సన్నిధానం వద్ద 5 వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు
- తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది నుంచి భారీగా తరలివస్తున్న భక్తులు

శబరిమల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో రెండు నెలల పాటు సాగే వార్షిక మండల-మకరవిళక్కు యాత్ర మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. మలయాళ మాసం 'వృశ్చికం' మొదలవుతుండటంతో కొండపై 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణ మార్మోగుతోంది. ఈరోజు సాయంత్రం 4 గంటలకే ఆలయ ద్వారాలు తెరుచుకోనుండగా, మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తున్నారు. మొదటి రోజే స్వామివారిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో కొండ దిగువకు చేరుకున్నారు. కేరళతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. 41 రోజుల పాటు కఠిన దీక్ష ఆచరించిన స్వాములు నల్లటి వస్త్రాలు ధరించి, నేతి కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని తలపై మోస్తూ పంబానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం 18 మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకుని నేతి అభిషేకం నిర్వహించనున్నారు. మండల కాలంలో రోజుకు దాదాపు 80,000 మంది భక్తులకు దర్శనం కల్పించేలా తిరువాన్మూర్ దేవస్వం బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇందులో 60,000 మందికి వర్చువల్ క్యూ ద్వారా, మిగిలిన వారికి స్పాట్ బుకింగ్ కేంద్రాల ద్వారా దర్శన అవకాశం కల్పిస్తున్నారు. యాత్రికుల రాకతో శబరిమల గిరులు ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరుస్తున్నాయి.

మొదటి పేజీ తరువాయి పాలిటెక్నిక్‌పై యూటర్న్.. విద్యార్థుల ఆందోళనకు ప్రభుత్వం దిగొచ్చింది!

. ఓ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ సిఫార్సుల ఆధారంగా ప్రస్తుతం జీవోను సవరించింది. ప్రస్తుతం ఉన్నట్టు విద్యా శాఖలోనే కొనసాగుతుందని తెలిపింది.సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థుల, ఉద్యోగ ప్రయోజనాలను కాపాడే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నత విద్యా శాఖ పరిపాలనా నియంత్రణలోకి తీసుకువచ్చింది. పాలిటెక్నిక్ కోర్సును కార్మిక శాఖ (శక్తి విభాగం) పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనలపై ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పాలిటెక్నిక్‌ను విద్యా శాఖలో కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు జీవో 97ను సవరించిన ప్రభుత్వం.. తాజాగా జీవో 157ను విడుదల చేసింది. పాలిటెక్నిక్ కాలేజీలు విద్యా శాఖలోనే కొనసాగుతాయని.. ఐటీఐలు, ఏటీఐలు మాత్రం కార్మిక శాఖ పరిధిలో వెళ్తాయని పేర్కొంది. అలాగే, యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం కూడా విద్యా శాఖ పరిధిలో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ పేరును శక్తిగా మారుస్తూ జులై 3న జీవో నెంబరు 97ను జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం.. కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను దీని పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. అదే, సమయంలో పాలిటెక్నిక్ కోర్సులను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేయాలని భావించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేసిన పాలిటెక్నిక్ విద్యార్థులు.. దాదాపు నెల రోజుల పాటు నిరసనలు చేపట్టారు.ఈ నిరసనలపై స్పందించిన ప్రభుత్వం.. కె.కేశవరావు నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకుని పాలిటెక్నిక్ కాలేజీలను విద్యా శాఖ పరిధిలోనే యథావిధిగా కొనసాగిస్తామని, స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయబోమని తాజాగా వెల్లడించింది.పాలిటెక్నిక్ విద్య ఆధునీకరణ, విద్యార్థులు, ఇతర భాగస్వాముల విద్య, కెరీర్ ప్రయోజనాలను పరిరక్షించే అంశాలను పరిశీలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఈ సవరణలు చేశారు. అలాగే, తమ విద్యా కార్యక్రమాలను విస్తరించేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, ఇతర సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకోవాలని వైఐఎస్‌యూను ప్రభుత్వం ఆదేశించింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందించాలి

- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



(కరీంనగర్, సాక్షర): కరీంనగర్ అర్హులైన ప్రతి పేదవాడికి చేయూత పెన్షన్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఇంకా అర్హులుంటే గుర్తించి పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు 100 మంది దరఖాస్తు చేసుకుంటే 10 మందికే పెన్షన్లు వచ్చే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.2,000కు పెంచిందని తెలిపారు. కొత్తపల్లి మండలంలో గతంలో 2,327 పెన్షన్లు ఉండగా, తాజాగా మరో 354 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని చెప్పారు. కొత్తగా పెన్షన్లు పొందిన లబ్ధిదారులకు, నూతన సర్పంచులకు అభినందనలు తెలిపారు. ఇంకా చాలా గ్రామాల్లో చిన్నచిన్న సాంకేతిక కారణాలు, రేషన్ కార్డు నిబంధనల వల్ల అర్హులకు పెన్షన్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభల్లో అర్హుల వివరాలు సేకరించి ప్రభుత్వంతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కరీంనగర్ ఫాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీఓ అశోక్ కుమార్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

'కోయగూడెం ఓసీ-3ను సింగరేణి సంస్థ ద్వారానే నిర్వహించాలి'

- ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ఉద్యమం తప్పదు
- సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

(టేకులపల్లి, సాక్షర): కోయగూడెం ఓసీ-3 బొగ్గు బ్లాక్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో టేకులపల్లి మండలం బోడు సెంటర్‌లో సోమవారం సుమారు నాలుగు గంటల పాటు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ.. సింగరేణి అనేది కేవలం బొగ్గు గనుల సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆస్తి అన్నారు. లక్షలాది మంది కార్మికుల చెమట, రక్తం, ప్రాణ త్యాగాలతో నిర్మితమైన సింగరేణి సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణతో కార్మికుల ఉద్యోగ భద్రత దెబ్బతినడంతో పాటు వేతనాలు, సౌకర్యాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగి శాశ్వత ఉద్యోగాల కల్పనకు అవకాశం లేకుండా పోతుందన్నారు. కోయగూడెం ఓసీ-3ను సింగరేణి సంస్థే నిర్వహించాలని, సింగరేణి కార్మికులే బొగ్గు తవ్వాలని, తద్వారా వచ్చే లాభాలు ప్రజలకు, సంస్థ అభివృద్ధికి ఉపయోగపడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ టెండర్లను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున సమ్మెకు, ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్, ఇల్లందు పట్టణ, మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్, బొబ్బిశెట్టి సత్యనారాయణ, వజ్జా చిరంజీవి, ఇమాయిల్, పగడయ్య, టేకులపల్లి మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్, మాజీ మండల కార్యదర్శి ఉడుత ఐలయ్య, ఉపసర్పంచ్ కాసిం, జక్కుల కనకయ్య, యాదగిరి, భాస్కర్, శరత్, జయరాజు, మాలోత్ హరిసింగ్, యు. రామకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, రాంబాబు, సోమరాజు, బిక్షపతి, ఆర్. నరసయ్య, కె. సారయ్య, డాక్టర్ రమేష్ బాబు, సాయి, లింగమూర్తి, గుగులోత్ సోని పాల్గొన్నారు.

ఐజేయు జాతీయ కౌన్సిల్‌కు నమస్తే తెలంగాణ రిపోర్టర్ కే.రామస్వామి ఎన్నిక

• హర్షం వ్యక్తం చేసిన టీటీడబ్ల్యూజేఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య రవి నాయక్

రెబ్బెన,సాక్షర:ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు)జాతీయ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నికల్లో తెలంగాణకు చెందిన ఐదుగురు గిరిజన జర్నలిస్టులకు ప్రాతినిధ్యం లభించింది.ముఖ్యంగా సీనియర్ జర్నలిస్టు కొమురం భీం జిల్లాకు చెందిన నమస్తే తెలంగాణ రెబ్బెన రిపోర్టర్ కుర్సింగ రామస్వామి,6టీవీ హైదరాబాద్ ప్రతినిధి మాలోత్ తిరుపతి నాయక్ వరుసగా రెండోసారి ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం గిరిజన జర్నలిస్టులకు గర్వకారణంగా నిలిచింది.రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 99టీవీ జర్నలిస్టు టి.వినోద్,హైదరాబాద్‌కు చెందిన ఈనాడు జర్నలిస్టుభూక్య వెంకన్న,మహబూబాబాద్‌కు చెందిన ఆంధ్రజ్యోతి జర్నలిస్టు టి.రవినాయక్ ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలపై తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీటీడబ్ల్యూజేఎ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య రవి నాయక్ హర్షంవ్యక్తం చేశారు.జాతీయ,రాష్ట్ర స్థాయిలో గిరిజన జర్నలిస్టులకు సముచిత ప్రాతినిధ్యం లభించడం శుభపరిణామమని పేర్కొన్నారు.మాలోత్ తిరుపతి నాయక్ రెండోసారి జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం ఆయన జర్నలిజం రంగంలో అందిస్తున్న సేవలకు,అనుభవానికి లభించిన గుర్తింపుగా అభివర్ణించారు.గిరిజన జర్నలిస్టులు కేవలం వృత్తి పరమైన రంగంలోనే కాకుండా జర్నలిస్టు సంఘాల జాతీయ,రాష్ట్ర స్థాయి నాయకత్వంలోనూ కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ,సంక్షేమం,వృత్తిపరమైన సమస్యల పరిష్కారంలో ఎన్నికైన ప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.గిరిజన జర్నలిస్టులకు సముచిత అవకాశాలు,ప్రాతినిధ్యం కల్పించడంలో సహకరించిన టీయూడబ్ల్యూజే (హెచ్-143)రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్,యూనియన్ అడ్వైజర్,మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్,రాష్ట్ర నాయకులు యోగానంద్,అవ్వారి భాస్కర్‌లకు భూక్య రవి నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జాతీయ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన ఐదుగురు జర్నలిస్టులకు టీటీడబ్ల్యూజేఏ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

మెగాస్టార్ చుట్టూ ఊహాగానాలు...మ్యాటర్ మాత్రం ?

(హైదరాబాద్, సాక్షర): మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అందరి వాడు. పరిశ్రమకు పెద్ద దిక్కు.. ఆయన పెద్దరికం మీద అందరికీ నమ్మకం ఉంది. అనేక సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇక చిరంజీవి స్వభావానికి రాజకీయాలు పడవని సన్నిహితులు అంటారు. ఆయన మెత్తని స్వభావం కలిగిన వారు. అందుకే ఆయన రాజకీయాల్లోకి ఎంత తొందరగా వెళ్లాలో అంతే వేగంగా వెనక్కి తిరిగారు. అది కూడా ఎలాంటి విమర్శలు పెద్దగా లేకుండానే గౌరవంగా తప్పుకున్నారు. ఇక తన జీవితం అంతా సినిమాలకే అంకితం అని ఆయన పదే పదే అనేక సార్లు చెప్పి ఉన్నారు. అయినా సరే మెగాస్టార్ చుట్టూ ఎపుడూ రాజకీయ ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన విషయంలో మరోసారి అలాంటి వార్తలే ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి.ఇదిలా ఉంటే హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి బీజేపీ అగ్ర నేత అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన కుమారుడు రామ్ చరణ్ తో పాటుగా వెళ్ళి కలిశారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా కూడా చిరంజీవి రాజకీయం గురించి మరోసారి చర్చించే విధంగా వార్తా కథనాలు అల్లుతున్న వారూ ఉన్నారు. అయితే అమిత్ షాను కలిసిన ప్రముఖులలో అనేక రంగాలకు చెందిన వారు ఉన్నారు. అందులో మై హోం నుంచి రామేశ్వరరావు, అలాగే ఒక ప్రముఖ తెలుగు టీవీ చానెల్ అధినేత ఇంకా అనేక మంది ఉన్నారు. అయితే అందరి దృష్టి మాత్రం మెగాస్టార్ మీదనే ఉంది. ఎందుకంటే ఆయన సినీ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి, అంతే కాదు జనసేన అధినేత పవన్ కి సోదరుడు కాబట్టి అని అంటున్నారు. ఇక పవన్ ఏపీలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అలా ఆ బంధాన్ని కూడా కలుపుతూ చిరంజీవి రాజకీయాల మీద చర్చించే వారూ ఉన్నారు..అయితే అమిత్ షాని చిరంజీవి కలవడం వెనక రాజకీయం లేదని అంటున్నారు. కేవలం మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ రంగం పరిస్థితులలో పాటు తమ సినిమాల గురించి చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇక చిరంజీవి విషయానికి వస్తే ఆయన రాజకీయంగా అందరి వాడుగా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆయనకు పార్టీలతో సంబంధం లేదని కూడా అంటున్నారు. ఏపీలో ఈ మధ్య పర్యటించిన మెగాస్టార్ కూటమి ప్రభుత్వం పాలన బాగుందని చెప్పారని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డితో కూడా అనేక వేదికలు పంచుకున్నారని అంటున్నారు. ఇలా అందరి వాడుగా ఉంటూ వస్తున్న చిరంజీవి రాజకీయాలలో క్రియాశీలకం అవుతారు అన్నది కేవలం ఊహాగానాలే అని అంటున్నారు. అయితే కమలం పార్టీకి ఆశలు మాత్రం ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కూటమిలో ఉన్నారు. చిరంజీవి వంటి బిగ్ ఫిగర్ కనుక తమతో ఉంటే తెలంగాణాలో కూడా అధికారానికి మరింత సులువు అవుతుందన్న లెక్కలు బీజేపీకి ఉన్నాయని చెబుతున్నారు. అయితే చిరంజీవి తిరిగి రాజకీయాల్లోకి వస్తారా అంటే అది ఈజీ కాదు కదా అసలు కుదిరే వ్యవహారం కానే కాదని అంటున్నారు. ఒక విధంగా చిరంజీవి రాజకీయం అన్నది ముగిసిన అధ్యాయం అని కూడా అంటున్నారు. అయితే కాలం ఎపుడూ గొప్పది చూడాలి మరి ఊహాగానాలు అలాగే ఉంటాయా లేక ఏమవుతాయి అన్నది.

అండర్ గ్రౌండ్ లోకి హఫీజ్ సయీద్, మసూద్ అజార్

(ముంబై, సాక్షర): భారత్‌పై ఉగ్రదాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు కీలక ఉగ్రవాద నేతలు హఫీజ్ సయీద్, మసూద్ అజార్‌ల విషయంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకున్నట్లు సమాచారం. భారత దాడుల భయం, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ వారిద్దరినీ రహస్యంగా వేర్వేరు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య వారిని ఉంచినట్లు తెలుస్తోంది.వివరాల్లోకి వెళ్తే.. లష్కరే తోయిబా అధినేత హఫీజ్ సయీద్‌ను లాహోర్‌లోని జోహర్ టౌన్ నుంచి రావల్పిండిలోని గారిసన్ గ్రౌండ్ ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఈ ప్రాంతం పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉండటం గమనార్హం. మరోవైపు జైషే మహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌ను సింధ్ ప్రావిన్స్‌లోని నవాబ్‌షాలో ఉన్న రహస్య నివాసానికి తరలించినట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయఈ మార్పుల వెనుక ప్రధాన కారణం ఆపరేషన్ సింధూర్ ప్రభావమేనని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన దాడులతో ఉగ్ర సంస్థలకు భారీ నష్టం వాటిల్లింది. అంతేకాకుండా పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక ఉగ్రవాదులు వరుసగా హతమవుతున్న నేపథ్యంలో ఐఎస్ఐ అప్రమత్తమైనట్లు సమాచారం. హఫీజ్ సయీద్ తన సంస్థ సభ్యులను నేరుగా కలవడం కూడా తగ్గించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆడియో సందేశాల ద్వారానే లష్కరే తోయిబా కార్యకర్తలతో మాట్లాడుతున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆయన కదలికలపై ఆంక్షలు విధించడంతో పాటు భద్రతను మరింత పెంచినట్లు సమాచారం. పాకిస్థాన్ మాత్రం సయీద్ కోట్ లఖ్‌పత్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడని చెబుతుండగా, అతను సురక్షిత నివాసంలో ఉన్నాడని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.మరోవైపు మసూద్ అజార్‌కు చెందిన జైషే మహమ్మద్ సంస్థ కూడా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో బహవల్పూర్‌లోని ఆ సంస్థ ప్రధాన స్థావరం మర్కజ్‌పై దాడులు జరగడంతో కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అప్పటి నుంచి సంస్థను తిరిగి బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అజార్ సైతం తన అనుచరులతో ప్రత్యక్ష సంబంధాలను తగ్గించుకుని, కొద్దిమంది కీలక కమాండర్లతో మాత్రమే సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఐక్యరాజ్యసమితి ఇప్పటికే హఫీజ్ సయీద్, మసూద్ అజార్‌లను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా ప్రకటించింది. 26/11 ముంబై ఉగ్రదాడులతో పాటు పలు దాడుల కేసుల్లో సయీద్ భారత్‌కు వాంటెడ్‌గా ఉన్నాడు. పుల్వామా, పఠాన్‌కోట్, పార్లమెంట్ దాడులతో సంబంధాలున్నట్లు అజార్‌పై ఆరోపణలు ఉన్నాయి. అయితే వీరిద్దరినీ నిజంగానే కొత్త రహస్య స్థావరాలకు తరలించారా? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే విషయాలపై అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఈ పరిణామాలు నిజమైతే, పాకిస్థాన్‌లో ఉగ్రవాద నేతల భద్రతపై పెరుగుతున్న ఆందోళనలకు ఇవి సంకేతాలుగా భావించవచ్చు.

క్రీడల్లోనూ బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

• విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) జిల్లా కేంద్రంలోని ఎం.జె.పి. గురుకుల బాలికల పాఠశాలలో గత ఆరు రోజులుగా నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వార్షిక క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. నవంబర్ 11న ప్రారంభమైన ఈ క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 ఎం.జె.పి. గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు.ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలు చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యతనిస్తూ అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. నేటి విద్యార్థినులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు అధిక సమయం కేటాయించకుండా ప్రతిరోజూ కనీసం గంటసేపు మైదానంలో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. దీనివల్ల ఆరోగ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత బాలికల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, గురుకుల పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని నిరంతరం సాధన చేయాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ద్వారా లభిస్తున్న అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా దానిని విజయానికి పునాదిగా భావించి పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు.ఈ పోటీల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, చెస్, టెన్నికాయిట్‌తోపాటు వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయా క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జె.పి. స్పోర్ట్స్ ఓఎస్డీ శ్రీనివాస్, ఆర్సీవో శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, పీడీ శైలజ, పీఈటీ పి. స్వాతి, ఉమ్మడి జిల్లాలోని వివిధ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభ్యాస గురుకులంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

• విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాలలో సందడే సందడి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) సోన్ మండల కేంద్రంలోని అభ్యసన గురుకులం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పుల్లూరి ప్రదీప్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటల పోటీలు, పాటలు,నృత్యాలు, నాటికలు నిర్వహించారు.చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమలోని సృజనాత్మకతను, ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ, పిల్లల హక్కులను కాపాడుతూ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు.బాలలే దేశ భవిష్యత్తు అని, వారి ప్రతిభను ప్రోత్సహించి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఆనందోత్సాహాల మధ్య బాలల దినోత్సవ వేడుకలు ముగిశాయి.

పెన్షన్లు పెంచి హామీ నిలబెట్టుకోవాలి - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



(గుడిహత్నూర్, సాక్షర) పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పెన్షన్లు పెంచి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఆసరా పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పెన్షన్ ఎంతో కీలకమైన ఆర్థిక ఆధారమని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి పెన్షన్ లబ్ధిదారునికి నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ అందించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పెన్షన్ లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీశైలంలోతగ్గిన నీటి నిల్వలు



(శ్రీశైలం, సాక్షర): శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా తగ్గుతున్నాయి. 215.80 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 48.57 టీఎంసీల నీరు మాత్రమే నమోదమయింది. 885 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి ప్రస్తుతం 829.10 అడుగులు వుంది. కేవలం 9 రోజుల్లో 3.03 టీఎంసీల మేర నీటి నిల్వలు తగ్గాయి. రోజుకు సగటున 0.33 టీఎంసీల నీటి తగ్గుదల నమోదయింది. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి స్తంభించింది. హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం తాగునీటి అవసరాలకు జూలై వరకు నీటిని సరిపెట్టేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం అభినందనీయం



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) నిర్మల్ జిల్లాకు చెందిన చిన్నారి నలం నిధ్యాన తన అసాధారణ ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి 'ఐబీఆర్ అచీవర్' బిరుదు పొందడం అభినందనీయమని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.చిన్నారి నిధ్యాన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు.కేవలం 5 సంవత్సరాల 1 నెల వయస్సులోనే రెండు చేతులతో విడివిడిగా ఇంగ్లీష్ పెద్ద, చిన్న అక్షరాలు, తెలుగు అచ్చులు, హిందీ అచ్చులు, 1 నుంచి 10 వరకు సంఖ్యలను కేవలం 10 నిమిషాల్లో రాసి తన ప్రతిభను చాటుకోవడం విశేషమని ఎమ్మెల్యే కొనియాడారు. చిన్న వయస్సులోనే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నిధ్యాన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తల్లిదండ్రులతో పాటు నిర్మల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.మామడ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంజూరు ఉత్తర్వులను అందజేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడం ద్వారా వారి జీవితాలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రామ్నాథ్, జమాల్, రమణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మామడ మండల అధ్యక్షులు రంజిత్ కుమార్, సర్పంచులు సురేందర్, సచిన్, రాజేశ్వర్, రూప్‌సింగ్, తిరుపతి, రమేష్, అశ్విన్ రెడ్డి, మల్లేష్, మల్లయ్య, మండల నాయకులు బాపురెడ్డి, కొండ్రా రాజరెడ్డి, రమణ, గోవర్ధన్, వెంకటేష్, జాలం నాయక్, నరేష్, నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస్ తదితరులతో పాటు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేర్చుకున్న విధానాలను పాఠశాలల్లో అమలు చేయాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్, సాక్షర) ఈ పర్యటనలో నేర్చుకున్న నూతన విధానాలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసి, విద్యార్థుల సమగ్ర వికాసానికి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జిల్లాలోని 24 పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఈఎంఓతో కలిసి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన మైసూర్‌లోని ఆర్ఐఐ, బెంగళూరులోని ఐఐఎం సందర్శనకు సోమవారం బయలుదేరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో పర్యటనకు వెళ్లే బస్సును జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల సందర్శనతో ప్రధానోపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులు, పాఠశాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ నెల 17న మైసూర్‌లోని ఆర్ఐఐలో ఆంగ్ల భాష బోధనలో ఆధునిక పద్ధతులు, పిల్లలకు సులభంగా ఆంగ్లం నేర్పించే విధానాలపై శిక్షణ పొందనున్నారు. అలాగే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపునకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. 18న బెంగళూరులోని ఐఐఎంను సందర్శించి, పాఠశాలలకు, సమాజానికి మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, సమాజ భాగస్వామ్యాన్ని పాఠశాల విద్యలో పెంపొందించడం, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక శిక్షణ పొందనున్నారు. అనంతరం అదే రోజు ఆదిలాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ఎస్ఎఫ్ఈఓ అశోక్, సెక్టోరల్ అధికారులు, డీవైఎస్ఓ దయానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా షూటింగ్‌తో మందమర్రిలో ట్రాఫిక్ జామ్!



• పాలచెట్టు ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఇబ్బందులు పడుతున్న మోడల్ స్కూల్ విద్యార్థులు, ప్రయాణికులు

(మందమర్రి ,సాక్షర) పట్టణంలోని పాలచెట్టు ప్రాంతంలో సినిమా షూటింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందిషూటింగ్ నీర్వాహకులు రహదారిపై ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా చిత్రీకరణ చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, మోడల్ స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సినిమా షూటింగ్ నిర్వహణ కోసం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, ట్రాఫిక్ అంతరాయం కలిగేలా షూటింగ్ నిర్వహించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎం చెప్పింది నమ్మాలా...! ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పింది నమ్మాలా



(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ లో నీటి సమస్య లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు. ముఖ్యమంత్రి , మంత్రులు అబద్ధాలకు ఎగబడ్డారు. మంత్రులు అధికారులు అబద్ధాలు చెప్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నాడు అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎండాకాలం వస్తుందంటే కేసీఆర్ ముందే ఆలోచన చేశారు. హైదరాబాద్ లో నీటి సమస్య వస్తుందని కేటీఆర్ ముందే చెప్పారు. మేడిగడ్డకు వెళ్ళిన మా పై సీఎం పరుష పదజాలంతో మాట్లాడాడు. ముఖ్యమంత్రి స్థాయిలో అలా మాట్లాడడం మన దురదృష్టమని అన్నారు. హైదరాబాద్ లో 2 లక్షల 33 వేల ట్యాంకర్ల వరకు వచ్చింది. మార్చి నెలలో హైదరాబాద్ లో దారుణమైన పరిస్థితి ఉండబోతుంది. ఇప్పటికే సింగూరు, మంజీర పూర్తిగా ఎండిపోయాయి. కృష్ణా జలాలు మూడు విడతల్లో హైదరాబాద్ కు తాగు నీళ్లు. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే.... రాబోయే రోజుల్లో కష్టం. నీటి కష్టాలు రాబోతున్నాయి జాగ్రత్తగా ఉండండని సీఎం అన్నాడు. నీటి కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు. ప్రజలు సీఎం చెప్పింది నమ్మాలా...! ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పింది నమ్మాలా అని ప్రశ్నించారు. నవంబర్ నెలలోనే హైదరాబాద్ లో బోర్లు ఎండిపోయాయి. ఎల్ నినో వస్తుందని తెలిసిన రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. రేవంత్ రెడ్డి ఎంతసేపు కేసీఆర్ ను బిఆర్ఎస్ తిట్టడమే సరిపోతుంది. కూకట్ పల్లి నియోజకవర్గంలో నీటి వినియోగం పెరిగింది. మోసపూరిత మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టడం ఖాయం. తీవ్రమైన వాటర్ సమస్య ఉందని జలమండలి ముందు బిఆర్ఎస్ ధర్నా చేసింది. నీటి సమస్య రాకుండా ప్రణాళికలు చేస్తున్నామని అధికారులు చెప్పారు. నవంబర్ నెలలోనే హైదరాబాద్ లో నీటి సమస్య మరింత పెరిగింది. హైదరాబాద్ లో నీటి సమస్య ఉంటే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తారా...? గ్లోబల్ సమ్మిట్ కు వచ్చిన వారికి ఏం సమాధానం చెప్తారు...! కేసీఆర్ నిర్మించిన STP ల ద్వారా గ్రీన్ వాటర్ ను పరిశ్రమలకు అమ్ముకుంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రేవంత్ రెడ్డి టైం పాసు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

• స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి వెంకటేశ్వర్లు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావుతో కలిసి ఆయన పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి దరఖాస్తుపై బాధ్యతాయుతంగా స్పందించాలని ఆదేశించారు.ప్రజావాణిలో భాగంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించి ప్రజలు తమ వినతులను అధికారులకు అందజేశారు.పిల్లల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు, వినతులను అధికారులకు సమర్పించారు.ఐదేళ్ల వయసులోనే ఏకకాలంలో రెండు చేతులతో రాస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన చిన్నారి నిద్యానను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవరావు ప్రత్యేకంగా అభినందించారు.నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన నాళం శ్రవణ్ కుమార్, గౌతమి దంపతుల కుమార్తె నిద్యాన తన అసాధారణ ప్రతిభతో ఈ ఘనత సాధించడం అభినందనీయమన్నారు. చిన్నారిని అభినందించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ చిన్నారి ప్రతిభను మరింత ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మాసాన్ని హరిహర మాసం అని ఎందుకంటారు?

• దీపారాధన నుంచి తులసీ పూజ వరకు ప్రతి ఆచారం వెనుక ఉన్న రహస్యం ఇదే

భారతీయ సనాతన ధర్మంలో ప్రతి మాసానికీ ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి పర్వదినానికీ ఒక పరమార్థం ఉంది. అయితే కొన్ని మాసాలుకేవలం పండుగలకే పరిమితం కాకుండా, మనిషి జీవన విధానాన్ని,ఆలోచనా సరళిని, ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయి.అలాంటి విశిష్టమైన మాసమే కార్తిక మాసం. శివారాధనకు, విష్ణుభక్తికి, దీపారాధనకు, తులసీ పూజలకు, ఉపవాసాలకు, దాన ధర్మాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చే ఈ మాసం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. కార్తిక మాసం అనగానే తెల్లవారు జామున నదీస్నానాలు, శివాలయాల్లో మారుమోగే రుద్ర నమక చమకాలు, ఆలయ ప్రాంగణాల్లో వెలిగే వేలాది దీపాలు, తులసికోట ముందు భక్తితో వెలిగించే ప్రమిదలు, కార్తిక సోమవార వ్రతాలు.. ఇలా ఒక నెల రోజుల వ్యవధిలో ఇన్ని నియమాలు పాటించమని ధర్మశాస్త్రాలు సూచించడం వెనక అనేక ఆధ్యాత్మిక శాస్త్రీయ రహస్యాలు దాగి ఉన్నాయి. కృత్తికా నక్షత్రంతో కూడిన పౌర్ణమి కాబట్టి ఈ మాసానికి కార్తికం అని పేరు. కృత్తిక అంటే అగ్ని. దానిని యజ్ఞం ద్వారా ఆరాధిస్తాం. ఆ అగ్నికి సూక్ష్మరూపం దీపం. పంచభూతాత్మకమైన సృష్టికి ప్రతీక దీపం. కార్తిక మాసంలో వ్రతాలు, నోములతో పాటు దీపారాధనకు ప్రాధాన్యం ఉంది. కార్తికం అంటేనే దీపాల పండుగ. దీపం చీకట్లను దూరం చేస్తుంది. ఒక దీపం అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని అందిస్తుంది. 'అసతో మా సద్గమయ.. తమసో మా జ్యోతిర్గమయ.. మృత్యోర్మా అమృతం గమయ..!' బృహదారణ్యక ఉపనిషత్తులోని ఈ ప్రార్థన భారతీయ ఆధ్యాత్మిక పరంపరలో జ్యోతికి (దీపాల వెలుగుకు) ఉన్న అత్యున్నత స్థానాన్ని తెలుపుతుంది. సూర్యుడు ఈ మాసమంతా తులా-వృశ్చికరాశుల్లో కదులుతుండగా, పౌర్ణమి నాడు చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు. దీంతో కార్తిక మాసంలో సూర్యకాంతి తగ్గి చీకటి దట్టంగా ఉంటుంది. సూర్యాస్తమయం త్వరగా అవుతుంది. మానవుల శరీరమూ శక్తిని పుంజుకోలేక నీరసపడే సమయమిది. ఆ శక్తిని ఉత్తేజితం చేయడంతో పాటు చీకట్లను పారద్రోలేందుకు ఉదయం పూట నెయ్యితో, సాయంకాలం నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తారు. మనలో ఉండే పంచతత్వాలకు ప్రతీకగా అయిదు రుచులతో ఉండే ఉసిరికపైన దీపాన్ని వెలిగించడం ఈ మాసంలో ప్రత్యేకంగా భావిస్తాం. ఈ మాసంలో రెండు సంధ్యలలో దీపారాధన చేస్తారు. వాటిలో సాయం సంధ్యాదీపం విశేషమైనది. ఆ సమయంలో హరిహర ఆలయాల్లో కానీ, పూజా మందిరంలో కానీ, తులసి కోట దగ్గర కానీ దీప ప్రజ్వలన చేస్తారు. కార్తికంలో కనిపించే మరో సంప్రదాయం ఎత్తైన ప్రదేశాల్లో వెలిగించే ఆకాశదీపం. ఇళ్ల వద్ద, ఆలయాల వద్ద ప్రాంతీయ ఆచారాలకు అనుగుణంగా దీన్ని ఏర్పాటు చేస్తారు. ఆకాశం వైపు వెలిగే ఈ జ్యోతి విశ్వవ్యాప్తమైన దైవచైతన్యాన్ని స్మరించే ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఈ ఆకాశదీపాలను తులసి కోట పక్కన పాడవైన కొయ్య స్తంభాన్ని ఏర్పాటు చేసి కొయ్య పలకలపైన ఆకాశదీపాన్ని నువ్వుల నూనెతో వెలిగిస్తారు. ఇంటి గడప దగ్గర వెలిగించే దీపం కుటుంబ శ్రేయస్సును కోరుకుంటే, ఆకాశదీపం సమస్త లోక కల్యాణాన్ని ఆకాంక్షించే భావనకు ప్రతీకగా చూస్తాం. కార్తికంలో వెలిగించే దీపం సర్వ శ్రేయోదాయకమని, అలాగే ద్రవ్యాలను బట్టి చేసే దీపదానాలు కూడా చాలా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం)లో అరుణాచల పర్వతంపై వెలిగించే మహాదీపం శివుని అనంతజ్యోతికి ప్రతీక. పర్వత శిఖరంపై కనిపించే ఆ మహాజ్యోతిని దర్శించుకోవడం కోసం లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఒక చిన్న ప్రమిదలో ప్రారంభమైన జ్యోతి, ఒక పర్వత శిఖరంపై విశ్వాన్ని స్మరింపజేసే మహాజ్యోతిగా ఆవిష్కృతమవడం కార్తికమాస ఆధ్యాత్మిక వైభవానికి ప్రత్యక్ష నిదర్శనంలా కనిపిస్తుంది. శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసంగా ఈ నెలను చెబుతారు. శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే.. ఈ మాసంలో శివుడికి, విష్ణువుకు విశేష పూజలు చేస్తారు అందుకే ఈ మాసాన్ని హరిహర మాసంగా పిలుస్తాం. విష్ణు సహస్రనామ పారాయణం, సత్యనారాయణస్వామి వ్రతాలు, శివారాధన తప్పనిసరిగా చేస్తారు. ఈ మాసంలో మరో ముఖ్యమైన ఆచారం బిల్వార్చన, తులసీ పూజలు. మూడు ఆకులతో కూడిన బిల్వదళాన్ని పరమశివుడికి సమర్పించడం ఈ మాసం శివారాధనలో అత్యంత ప్రీతికరమైనది. 'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చ త్రియాయుధమ్.. త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్..' అని బిల్వాష్టకంలో చెబుతాం. బిల్వ దళంలోని మూడు ఆకులను త్రిమూర్తులకు, త్రిగుణాలకు, శివుడి త్రినేత్రాలకు ప్రతీకలుగా వివిధ భక్తి వ్యాఖ్యానాలు వివరిస్తాయి. బిల్వదళాన్ని సమర్పించడం అంటే ప్రకృతి ప్రసాదించిన ఒక పవిత్రమైన కానుకను భగవంతుడికి అర్పించడం. ఇందులో భక్తి, వినయం, సమర్పణ భావం ప్రధానమైనవి. ఇదే మాసంలో తులసీ ఆరాధనకు ప్రత్యేక స్థానం ఉంది. విష్ణుభక్తి సంప్రదాయంలో తులసిని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. కార్తికంలో శ్రీమహావిష్ణువుకు తులసీదళాలతో పూజచేయడం విశేష ఫలప్రదమని పురాణాలు పేర్కొన్నాయి. తులసి ప్రాశస్త్యం కేవలం పూజా విధానానికే పరిమితం కాదు. భారతీయ గృహ సంస్కృతిలో తులసి అత్యంత పవిత్రమైన జీవన సంప్రదాయం. కార్తిక మాసంలో తులసీ కల్యాణం ముఖ్యమైన వేడుక. తులసీ అమ్మవారికి, శ్రీమహావిష్ణువు స్వరూపమైన శాలగ్రామం లేదా శ్రీకృష్ణుడితో వివాహం జరిపిస్తారు. ఈ వేడుక వెనక ఉన్న పురాణగాథ బృందాదేవి చరిత్రతో అనుసంధానమై ఉంటుంది. శివభక్తి గొప్పదా, విష్ణుభక్తి గొప్పదా అనే భేదం లేకుండా కార్తిక దామోదరుడుగా విష్ణువును, రుద్రుడుగా పరమేశ్వరుని కొలుస్తాం. ఈ అద్వైత తత్వాన్ని లోకానికి చాటిచెప్పడంలో భాగంగా హరిహరసుతుడైన అయ్యప్పను ఈ మాసంలోనే విశేషంగా పూజిస్తారు. అటు శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా ప్రాధాన్యం కలిగిన ఈ కార్తిక మాసంలో నదీస్నానం, దేవతార్చనం, సత్య నారాయణ వ్రతం, దీపారాధన, దీపదానం మొదలైనవి నియమనిష్ఠలతో ఆచరించిన వారికి అక్షయ సంపదలు, సకల శుభాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. తెల్లవారుజామున నదీస్నానం మొదలు సాయంత్రం ప్రమిద వెలిగించే వరకు, తులసి కోట నుంచి శివాలయం వరకు, బిల్వ దళం నుంచి ఉసిరి వృక్షం వరకు ప్రతి ఆచారంలోనూ ఒక విశ్వాసం ఉంది. ప్రతి విశ్వాసం వెనకా ఒక తాత్త్విక భావన నిగూఢంగా కనిపిస్తుంది. ఒక చిన్న ప్రమిదలో విశ్వతత్వం, ఒక తులసీదళంలో భక్తి పరిమళం, బిల్వపత్రంలో శివ రహస్యం.. ఇలా ప్రతీ ఆచారం వెనక అంతరార్థం.. అదే కార్తిక మాస రహస్యం. ఇక్కడ దీపం వెలుగు మాత్రమే కాదు.. జ్ఞానానికి ప్రతిరూపం, చెట్టు కేవలం వృక్షం కాదు జీవనాధారం, నది కేవలం ప్రవహించే నీరు కాదు జీవన సంస్కృతి. ఈ సమస్త ప్రకృతిలో ఒకే పరమతత్వాన్ని దర్శించడమే భారతీయ ఆధ్యాత్మికతలోని అంతరార్థం. అలాంటి ప్రకృతి ఆరాధనకు, అంతరంగ సాధనకు, దైవ చింతనకు ఒక ప్రత్యేకమైన వేదిక కార్తిక మాసం.



శ్రీ నీలకంఠేశ్వరాలయంలో ఆధ్యాత్మిక శోభ

• భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో శ్రీరామ్ రవీందర్ తెలిపారు.కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో వెలసిన శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది.తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసంలో సోమవారానికి విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయంలో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. హర హర మహాదేవ, ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొనడంతో పండుగ వాతావరణం కనిపించింది.కార్తీక మాసంలో శివారాధన చేయడం ఎంతో పుణ్యప్రదం. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయానికి భక్తుల రాక పెరుగుతుండగా, తొలి సోమవారం కావడంతో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది. శ్రీ నీలకంఠేశ్వర స్వామి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.భక్తులకు ఆలయంలో తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ సిద్ధంగా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన పూజారి, పూజారులు భక్తులకు అభిషేకాలు, అర్చనలు చేయించారు.

ఐజేయు జాతీయ కౌన్సిల్ మెంబర్ గా కుర్సింగ రామస్వామి



(రెబ్బెన,సాక్షర:): ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయు)జాతీయ కౌన్సిల్ సభ్యునిగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలానికి చెందిన నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ కుర్సింగ రామ స్వామి ఎన్నికయ్యారు.ఎన్నికకు సంబంధించిన పత్రాన్ని స్టేట్ చీఫ్ రిటర్నింగ్ ఆఫీసర్ గొర్ల బుచ్చన్న 16వ తేదీన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎన్నికైన కె.రామస్వామి మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ,సంక్షేమ వృత్తిపరమైన సమస్యల పరిష్కారంలో అందరి సహకారంతో ముందుంటానని అన్నారు.యూనియన్ లో సముచిత అవకాశం కల్పించిన టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి ఆస్కని మారుతి సాగర్,యూనియన్ అడ్వైజర్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్,కొమరం భీమ్ ఆసిఫాబాద్ కన్వీనర్ భుక్య రవి నాయక్, నాయకులు తిరుపతి నాయక్,యోగానంద్, భాస్కర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

(సిద్దిపేట, సాక్షర): ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణ పనులను: జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19 న ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభ ప్రాంగణం మొత్తం ట్రాక్టర్, డోజర్లతో లెవెలింగ్ పనులు దాదాపు పూర్తి, గ్రౌండ్ మొత్తం పలు మార్లు వాటరింగ్ చెయ్యాలని అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ చుట్టూ బారి కెడింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని, వాటరింగ్ పూర్తి కాగానే స్టేజి పనులు మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కోసం గ్రౌండ్ చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలను ట్రాక్టర్ డోజర్లతో చదును చేసి వాహనాలు సులువుగా వెళ్లి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ హరి కిరణ్, అర్ అండ్ బి, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుంకిడి గ్రామానికి ఎమ్మెల్యే రాక

• రైతు వేదికలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

తలమడుగు, సాక్షర: మండలంలోని సుంకిడి గ్రామంలో నేడు నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరుకానున్నట్లు గ్రామ సర్పంచ్ మగ్గిడి ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతు వేదికలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, పింఛన్ లబ్ధిదారులు హాజరుకావాలని సర్పంచ్ మగ్గిడి ప్రకాష్ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి - నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని కడ్తల్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రూ.39.81 లక్షల నికర నిధులు ప్రస్తుతం మంజూరయ్యాయని వెల్లడించారు. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో మార్కింగ్ పూర్తి చేసి, అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని సూచించారు. నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.అదేవిధంగా ఆలయం పక్కన ఉన్న షెడ్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల కోసం అదనపు నిధులు మంజూరు చేయించేందుకు కూడా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అనేక సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి సేవలో నిమగ్నమై, ఆలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నర్సారెడ్డి స్వామి, చిన్నయ్య స్వామి సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ అభివృద్ధి పట్ల వారు చూపుతున్న అంకితభావం, భక్తులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఆధ్యాత్మిక కేంద్రంగా కడ్తల్ అయ్యప్ప స్వామి ఆలయం మరింత అభివృద్ధి చెందేందుకు భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, రమణారెడ్డి, జమాల్, సరికేల గంగన్న, సాదం అరవింద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీపీ హరీష్ రెడ్డి, సర్పంచ్ రాజు రెడ్డి, బీజేపీ నాయకులు జుట్టు దినేష్, కందుల హరీష్, అయ్యప్ప స్వాములు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



• భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) విద్యార్థులు అన్ని రకాల సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్సూ చించారు.సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లో గల ఐటీఐ కళాశాలలో 300 మంది విద్యార్థులతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, గుర్తు తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌లు, లింకులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యాశకు గురై తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని, అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆఫర్లను నమ్మి సైబర్ మోసాలకు గురికావద్దని సూచించారు.సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల నుంచి, కొన్ని సందర్భాల్లో విదేశాల నుంచి కూడా నేరాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అప్రమత్తతతో పాటు అవగాహన కలిగి ఉండటం ద్వారా సైబర్ మోసాలను అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కేవైసీ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఫేక్ బాబా పేరుతో ఆధ్యాత్మిక మోసాలు, సోషల్ మీడియా ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, మ్యాట్రిమోనీ ఫ్రాడ్, నకిలీ లింకులు, మెసేజ్‌ల ద్వారా జరిగే మోసాలు, ఓటీపీ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, మ్యూల్ అకౌంట్స్ వంటి సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ప్రమాదాల నివారణకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై స్పష్టమైన నిర్దేశాలతో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, సీఐ ఎం ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్, డి4సీ ఏఎస్ఐ సురేందర్, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూతురి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు

• యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం సంతోషం



(గుడిహత్నూర్, సాక్షర) తన కూతురు స్మారకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం పట్ల కోల నగేష్ హర్షం వ్యక్తం చేశారు. గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన కోల నగేష్ తన కూతురి జ్ఞాపకార్థం ఆదివారం గ్రామంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.గత ఏడాది కోల నగేష్ కూతురు కోల సహస్రిత అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం గ్రామంలో కూతురి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు స్వచ్ఛంద రక్తదానం చేశారు.రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని దాతల నుండి రక్తాన్ని సేకరించారు.

డిజిటల్ ట్విన్ టెక్నాలజీతో నీటి వృధాకు చెక్...

(హైదరాబాద్, సాక్షర): నీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ పరిశోధకులు 'డిజిటల్ ట్విన్' టెక్నాలజీని సూచిస్తున్నారు. ఈ విధానంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కార్యాలయాలు, పరిశ్రమల్లో కనీసం 20 శాతం నీటిని ఆదా చేయవచ్చని చెబుతున్నారు. పైప్‌లైన్లు, ట్యాంకులు, వాల్వులకు సెన్సర్లు అమర్చి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో అనుసంధానిస్తారు. ఎక్కడ లీకేజీలు ఉన్నా, నీటి ఒత్తిడి తగ్గినా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందుతుంది. అవసరమైతే అక్కడి నుంచే వాల్వులను కంట్రోల్ చేయవచ్చు. అపార్ట్‌మెంట్లలో ప్రతి ఫ్లాట్ ఎంత నీటిని వినియోగిస్తోందో కూడా తెలుసుకోవచ్చు. నల్లాలు తెరిచి వదిలేస్తే హెచ్చరికలు ఇవ్వడంతో పాటు ఆటోమేటిక్‌గా మూసివేసే అవకాశమూ ఉంటుంది. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు కూడా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.నీటి వృథాను అరికట్టి భవిష్యత్తు అవసరాల కోసం నీటిని పొదుపు చేసేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోంది. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో.. రానున్న రోజుల్లో నీటి కొరత రానుందనే హెచ్చరికల నేపథ్యంలో ఉన్న నీటిని చాలా పొదుపుగా వాడుకోవడం కూడా చాలా అవసరం. ఈ నేపథ్యంలోనే ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆఫీసులు, పరిశ్రమల్లో నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తూ వృథాను తగ్గించేలా 'డిజిటల్ ట్విన్' వ్యవస్థను ఉపయోగించుకోవచ్చని హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటీ) స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ పరిశోధకులు సూచిస్తున్నారు. ఈ విధానంతో కనీసం 20 శాతం నీటి వృథాను అరికట్టవచ్చని చెబుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని వివరిస్తున్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు సుమారు 130 లీటర్ల నీరు అవసరం అవుతుంది. అయితే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు స్థానిక సంస్థలు సరఫరా చేసే నీటితో పాటు వ్యక్తిగత బోర్లు, ఇతర నీటి వనరులపై ఆధారపడుతున్నారు. ఈ నీటిని వినియోగించే క్రమంలో పెద్ద మొత్తంలో వృథా చేస్తున్నారు. స్నానం చేయడం, దుస్తులు ఉతకడం, వంట పాత్రలు శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం, వాహనాలు కడగడం వంటి పనుల్లో అవసరానికి మించి నీటిని వినియోగిస్తున్నారు. మరోవైపు.. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగవచ్చన్న అంచనాల నేపథ్యంలో నీటి పొదుపుపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.నీటి సరఫరా వ్యవస్థను డిజిటల్ రూపంలో పర్యవేక్షిస్తూ.. ఎక్కడ ఎంత నీరు వినియోగిస్తున్నారు.. ఎక్కడ లీకేజీలు జరుగుతున్నాయి.. ఎక్కడ నీటి ఒత్తిడి తగ్గుతోంది.. వంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే సాంకేతిక విధానమే డిజిటల్ ట్విన్. ఇందుకోసం నీటి సరఫరా పైప్‌లైన్లు, స్టోరేజ్ ట్యాంకులు, వాల్వులకు ప్రత్యేక సెన్సర్లను అమర్చుతారు. వీటిని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) టెక్నాలజీతో అనుసంధానిస్తారు. ఉదాహరణకు హైదరాబాద్ నగరానికి రోజుకు 500 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తుంటే.. వివిధ కారణాలతో 20 నుంచి 25 శాతం నీరు వృథా అవుతోందని అంచనా. డిజిటల్ ట్విన్ వ్యవస్థ ద్వారా ఈ వృథాను గుర్తించి కంట్రోల్ చేయవచ్చని చెబుతున్నారు.పైప్‌లైన్‌లో ఎక్కడైనా పగుళ్లు ఏర్పడినా, నీటి ఒత్తిడి తగ్గినా, స్టోరేజ్ ట్యాంకుల నుంచి సరఫరాలో సమస్య వచ్చినా కమాండ్ కంట్రోల్ కేంద్రంలోని తెరపై వెంటనే సమాచారం కనిపిస్తుంది. పైప్‌లైన్ పగిలినప్పుడు సిబ్బంది అక్కడికి వెళ్లి వాల్వులు మూసే వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. సిమ్యులేటర్ సాఫ్ట్‌వేర్ సాయంతో కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచే సంబంధిత వాల్వులను నిలిపివేయవచ్చు. ఈ విధానాన్ని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లోనూ అమలు చేయవచ్చు. ప్రతి ఫ్లాట్‌కు నీరు సరఫరా చేసే పైపులకు సెన్సర్లు అమర్చడం ద్వారా ఏ ఇంట్లో ఎంత నీరు వినియోగిస్తున్నారో తెలుసుకోవచ్చు.ఉదాహరణకు ఒక ఫ్లాట్‌లో నలుగురు నివసిస్తుంటే రోజుకు 520 లీటర్ల నీరు సరిపోతుందని అంచనా వేస్తే.. అదే ఫ్లాట్‌లో 900 లీటర్లు వినియోగిస్తున్నారంటే అవసరానికి మించి నీటిని వాడుతున్నట్లు గుర్తించవచ్చు. తద్వారా వినియోగదారులను అప్రమత్తం చేసి నీటి వృథాను తగ్గించవచ్చు. అంతేకాదు.. పైప్‌లైన్లు, సంపులు, ట్యాంకుల్లో లీకేజీలు ఏర్పడితే సెన్సర్లు వెంటనే గుర్తించి డాష్‌బోర్డుకు సమాచారం పంపిస్తాయి. ఇంట్లో ఎవరైనా నల్లా తెరిచి అలాగే వదిలేసినా, చిన్నపిల్లలు బాత్‌రూమ్, సింక్ వద్ద నల్లా మూయడం మర్చిపోయినా సంబంధిత ఫ్లాట్‌లో హెచ్చరికలు జారీ చేయవచ్చు. వారు స్పందించకపోతే సెన్సర్ల సాయంతో ఆటోమేటిక్‌గా నల్లాను మూసివేసే అవకాశం కూడా ఉంటుంది.గేటెడ్ కమ్యూనిటీల్లో రోజులో ఏ సమయాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందో సెన్సర్ల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ వివరాల ఆధారంగా నీటి సరఫరా ఒత్తిడిని కంట్రోల్ చేయవచ్చు. 24 గంటలూ నీటి సరఫరా కొనసాగిస్తూనే.. అవసరమైన సమయాల్లో ఎక్కువ ఒత్తిడితో, వినియోగం తక్కువగా ఉన్న సమయాల్లో ఒత్తిడిని తగ్గించడం ద్వారా 10 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఈ డిజిటల్ ట్విన్ వ్యవస్థతో కేవలం నీటి వృథాను అరికట్టడమే కాకుండా మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంటున్నారు.నీటి నాణ్యత, కాలుష్య ప్రభావాన్ని నిరంతరం పర్యవేక్షించవచ్చు. కలుషిత నీటి కారణంగా వ్యాపించే వ్యాధులను ముందుగానే గుర్తించి కంట్రోల్ చేసే అవకాశాలు ఉంటాయి. ఒకసారి ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తే నిరంతరం పనిచేస్తుందని ప్రస్తుతం నీటి నిర్వహణ కోసం చేస్తున్న ఖర్చుతో పోలిస్తే తక్కువ వ్యయంతోనే దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చని ట్రిపుల్ ఐటీ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ టెక్నాలజీ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం వివరించారు. నీటి కొరత ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో టెక్నాలజీ ఉపయోగించి ప్రతి చుక్క నీటినీ సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఈ విధానం సూచిస్తోంది.

పునర్విభజన బిల్లుకు ఎన్సీపీ మద్దతు

(ముంబై, సాక్షర): పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయంలో ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే మద్దతు పలికారు. దేశవ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన కాకుండా, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాల్లో సమానంగా ప్లాట్ ఫార్ములాతో 50 శాతం లోక్‌సభ స్థానాలను పెంచే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే తమ పార్టీ దానికి సానుకూలంగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన సొంత నియోజకవర్గమైన బారామతిని ఉదాహరణగా చూపుతూ—గతంలో 10–12 లక్షలుగా ఉన్న ఓటర్ల సంఖ్య నేడు 20–22 లక్షలకు పెరిగిందని, కేవలం రూ. 5 కోట్ల ఎంపీ నిధులతో ప్రతి గ్రామానికి న్యాయం చేయడం సాధ్యం కావడం లేదని, మెరుగైన పాలన కోసం నియోజకవర్గాల విభజన అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.అయితే, సుప్రియా సూలే ప్రకటనపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నుంచి భిన్నమైన స్పందన వ్యక్తమైంది. డీలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వాలనుకుంటే అది వారి పార్టీ వ్యక్తిగత నిర్ణయం కావొచ్చు, కానీ అందులో ఇండియా కూటమి లేదా కాంగ్రెస్ పేరును ప్రస్తావించవద్దు అని కాంగ్రెస్ స్పందించింది. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల పరిధిలోనే పునర్విభజన జరగాలని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. మరోవైపు, జులైలో కేంద్రం నిర్వహించిన సమావేశంలో సమానంగా 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన చర్చకు వచ్చిందని, అయితే ఇప్పటివరకు అధికారికంగా బిల్లు ముసాయిదా ఏదీ తమకు అందలేదని, తుది నిర్ణయం తీసుకునే ముందు కూటమి భాగస్వాములతో చర్చిస్తామని సుప్రియా సూలే వివరణ ఇచ్చారు.ఎన్డీఏ కూటమికి ఈ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ఆమోదించుకోవడానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో సుప్రియా సూలే చేసిన ఈ వ్యాఖ్యలు ఎన్డీఏకు బలం చేకూర్చేలా ఉన్నాయి. ఇదే సమయంలో, రెండు ఎన్సీపీ వర్గాల విలీనంపై వస్తున్న ఊహాగానాలను ఆమె పూర్తిగా తోసిపుచ్చారు—తాము ఎన్డీఏలో చేరడం లేదని, విలీన చర్చలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నామని స్పష్టం చేశారు.

ఏపీవైపు అక్వాన్ తుఫాన్

(విశాఖపట్టణం, సాక్షర): అక్వాన్ తుఫాన్ తీరం దాటేది ఇక్కడే..! ఏపీకి భారీ వర్ష సూచన.. ఇదిగో లేటెస్ట్ వెదర్ రిపోర్ట్ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం అక్వాన్ తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నవంబర్ 20న నెల్లూరు-తుని మధ్య ఏపీ, యానాం తీరాలను దాటే సూచనలు ఉన్నాయి. తీరం దాటే సమయంలో గంటకు 120–145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉంది. తీరప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.అర్నబ్, మురసు తుఫాన్ల బీభత్సం నుంచి ఏపీ కోలుకోకముందే.. అక్వాన్ తుఫాన్ తరుముకొస్తోంది.. బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది సోమవారం సాయంత్రానికి తుఫానుగా.. మంగళవారం తీవ్ర తుపానుగా మారనుంది.. తుఫానుగా మారిన తర్వాత.. అక్వాన్ గా నామకరణం చేయనున్నారు. అయితే.. తుఫాను తీరం దాటే సమయంపై వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. నవంబర్ 20వ తేదీ మధ్యాహ్నం సమయానికి అతి తీవ్ర తుఫానుగా మారి నెల్లూరు – తుని మధ్య ఆంధ్రప్రదేశ్, యానాం తీరాలను దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనావేసింది.. ప్రస్తుతం తీవ్ర వాయుగుండం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 800 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 700 కిలోమీటర్లు, గోపాల్‌పూర్ కు 910కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గంటకు 6 కి.మీ వేగంతో కదులుతోంది. ఇది వాయువ్య దిశగా ప్రయాణిస్తూ ఈ రోజు సాయంత్రానికి తుఫానుగా, నవంబర్ 17 సాయంత్రానికి తీవ్ర తుఫానుగా బలపడనుంది..వాయవ్య దిశగా కదులుతూ, ఇది శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు, తుని మధ్య తీరాన్ని అతి తీవ్రమైన తుఫానుగా దాటే అవకాశం ఉంది. మత్స్యకారులు చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లకూడదు. దీని ప్రభావం వల్ల, గురువారం – శుక్రవారం తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లో బలమైన గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది; కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో 120-145 కిమీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సిఈవో ప్రఖర్ జైన్ సూచించారు. తెలంగాణలో అలెర్ట్.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి 'అక్వాన్' తుపానుగా మారుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. నవంబర్ 21వ తేదీన తుపాను ప్రభావం గరిష్ఠ స్థాయికి చేరవచ్చని.. కొన్ని ప్రాంతాల్లో 150 నుంచి 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వేగంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది.ఈ తుపానుకు ఇరాన్ సూచించిన 'అక్వాన్' అనే పేరు పెట్టారు. ఆదివారం సాయంత్రం నాటికి ఈ వ్యవస్థ విశాఖపట్నానికి దక్షిణ-ఆగ్నేయంగా సుమారు 920 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. ఇది వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 16వ తేదీ నాటికి తుపానుగా.. నవంబర్ 17వ తేదీ నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తొలుత అంచనా వేసింది. ఆ తర్వాత మరింత బలపడి నవంబర్ 19వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారవచ్చని పేర్కొంది. తుపాను సమయంలో గంటకు 120 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. గరిష్ఠ వేగం గంటకు 145 కిలోమీటర్ల వరకు చేరవచ్చని తెలిపింది.ప్రస్తుత వాతావరణ నమూనాల ప్రకారం.. అక్వాన్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబర్ 20వ తేదీన నెల్లూరు నుంచి తుని మధ్య, ముఖ్యంగా కావలి నుంచి కోనసీమ ప్రాంతాల మధ్య ఒంగోలు లేదా బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే తుపాను తీరం దాటే ప్రాంతం, తీవ్రతపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. తుపాను ప్రభావంతో కోస్తాంధ్రలో నవంబర్ 18వ తేదీ నుంచే వర్షాలు ప్రారంభమై.. 19, 20వ తేదీల్లో తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.అక్వాన్ తుపాను ఈనెల 20 నుంచి 22 వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాలపై తుపాను ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 150 నుంచి 200 మిల్లీమీటర్లకు మించి వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారుముఖ్యంగా నవంబర్ 21వ తేదీన వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ విశ్లేషకులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఈ 2 రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని అంచనా వేస్తున్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని సూచిస్తున్నారు. అయితే పశ్చిమ తెలంగాణ జిల్లాలపై తుపాను ప్రభావం తక్కువగా ఉండవచ్చని వాతావరణ విశ్లేషకులు చెబుతున్నారు. అక్కడ తేలికపాటి వర్షాలు లేదా పొడి వాతావరణం కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. 20 న తీరాన్ని తాకే అవకాశం ఈ నెల 20వ తేదీన కోస్తాంధ్ర తీరాన్ని తీవ్ర తుపాను తాకనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ముప్పు పొంచి ఉన్నందున క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఉన్న ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన అధికారులతో తాజా పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం క్రమంగా బలపడుతోందని, ఇవాళ సాయంత్రానికి ఇది తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను తరహాలోనే దీని తీవ్రత కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.రానున్న తుపాను ప్రభావం ప్రధానంగా అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం అంచనా వేసింది. తుపాను కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సీఎం సూచించారు. గతంలో కేంద్ర బృందం చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని, వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.తీవ్ర ప్రభావం ఉండే అవకాశమున్న ప్రాంతాలకు ముందస్తుగానే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సిబ్బందిని, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అదే సమయంలో భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని సమర్థవంతంగా రిజర్వాయర్లకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సింగరేణి కార్మికులు అసాధ్యాన్ని సుసాధ్యం చేసే నేర్పరులు

• కాసిపేట 1 గని ని సందర్శించిన ఆసిఫాబాద్ డి ఎఫ్ ఓ సన్మానించిన గని అధికారులు



(కాసిపేట, సాక్షర) సింగరేణి ఉద్యోగులు కష్టపడి పనిచేసేవారని, చీకట్లను తొలగించి దేశానికి వెలుగులు పంచేవారని, అసాధ్యమైన పనులను కూడా సుసాధ్యం చేయగల నేర్పరులు సింగరేణి కార్మికులని ఆసిఫాబాద్ డీఎఫ్ఓ సీహెచ్ బాలమణి అన్నారు. కాసిపేట 1 ఇంక్లైన్ గనిని అసిఫాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి సీహెచ్ బాలమణి సోమవారం సందర్శించారు. వారిని గని మేనేజర్ సతీష్, అధికారులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.గనిలో ఉన్న పర్యావరణాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. గని పరిసరాలు పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, చూపరులను ఆకర్షించే వన్యప్రాణుల చిత్రాలు బాగున్నాయని అన్నారు.ఉద్యోగులతో మాట్లాడి వారి బాగోగులను, పని విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు గని పని స్థలాలను పరిశీలించి, ఉద్యోగుల పని విధానాన్ని, బొగ్గు ఉత్పత్తిని, యంత్రాల పనితీరును తెలుసుకున్నారు.కార్యక్రమంలో మేనేజర్ సతీష్, రక్షణాధికారి సురేష్, సర్వేయర్ రవీందర్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల పక్షాన పోలీసు వ్యవస్థ ఉండాలి- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



(ఆదిలాబాద్, సాక్షర) పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలబడుతుందని, ప్రజలకు న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్

ఎల్కతుర్తి కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం



(హన్మకొండ, సాక్షర): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పనిచేయాలి. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వేదికగా నిలవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎల్కతుర్తి మండలంలో రోడ్లు, ఆసుపత్రి, కోర్టు, బస్టాండ్, 132 కేవీ సబ్‌స్టేషన్ వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పనిచేయాలి. మండల కాంగ్రెస్ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

గిగ్ వర్కర్ల పై కాంగ్రెస్ ప్రేమ....

(హైదరాబాద్, సాక్షర): హైదరాబాద్ మాదాపూర్‌లోని జయభేరి గ్రౌండ్స్ వేదికగా జరిగిన గిగ్ వర్కర్ల సమ్మేళనంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి గిగ్ , ప్లాట్‌ఫామ్ కార్మికులపై వరాల జల్లు కురిపించారు. గిగ్ వర్కర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా, వై-పై సౌకర్యంతో కూడిన విశ్రాంతి కేంద్రాలు కల్పిస్తామని, వారి కుటుంబాల విద్య, వైద్య బాధ్యతలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. అయితే, రాహుల్ గాంధీ చేసిన ఈ భారీ ప్రకటనలు గత ఎన్నికల ప్రచారంలోనూ చేశారు. మరి మూడేళ్లుగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గిగ్ వర్కర్లకు వాస్తవంగా అందిన ప్రయోజనాలేమిటన్న ప్రశ్న ఇప్పుడు బలంగా తెరపైకి వస్తోంది.తెలంగాణ విషయానికొస్తే, డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం కేవలం కాగితాలు, వాయిదాలకే పరిమితమైందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ఎన్నికల ముందు అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరిగింది. కనీసం కార్మిక శాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించడానికే ఏడాదిన్నర సమయం పట్టింది. ని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ఏప్రిల్ 2026లో గవర్నర్ ఆమోదం పొందిన తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల చట్టం జూన్ 2న లాంఛనంగా ప్రారంభమైనప్పటికీ, విధివిధానాలు ఖరారు కాకపోవడంతో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా కార్మికులకు అందలేదు. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన కోసమే హడావుడిగా నిబంధనలు విడుదల చేశారే తప్ప, గత మూడేళ్లలో ప్రమాదాలకు గురైన వందలాది మంది డెలివరీ బాయ్స్ కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందిన భరోసా శూన్యం.మరోవైపు, 2023 మే నెలలో అధికారంలోకి వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. బెంగళూరు వంటి ఐటీ నగరంలో లక్షలాది మంది గిగ్ వర్కర్లు పనిచేస్తున్నప్పటికీ, అక్కడ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వానికి రెండేళ్లకు పైగా సమయం పట్టింది. ఆగస్టు 2025లో కర్ణాటక ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ బిల్లు ను ఆమోదించి, ఫిబ్రవరి 2026లో అగ్రిగేటర్ కంపెనీల నుంచి 1% నుంచి 5% వరకు సంక్షేమ రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో దాని అమలు నత్తనడకన సాగుతోంది. సంక్షేమ రుసుము వసూలు కోసం ఉద్దేశించిన పేమెంట్ అండ్ వెల్ఫేర్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ పోర్టల్ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కంపెనీలు స్వచ్ఛందంగా లెక్కలు చూపి డబ్బులు జమ చేయాలనే నిబంధన పెట్టడంతో, అగ్రిగేటర్ల నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం, కార్మికుల యూనిక్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగడం విమర్శలకు తావిస్తోంది.రెండు రాష్ట్రాల కాంగ్రెస్ ప్రభుత్వాల తీరుపై గిగ్ వర్కర్లలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆరు గ్యారంటీల అమలులోనే తడబడుతున్న తెలంగాణ ప్రభుత్వం, ఇప్పుడు గిగ్ వర్కర్ల కుటుంబాల విద్య, వైద్య బాధ్యతలను కూడా తీసుకుంటామని రాహుల్ గాంధీతో కొత్త హామీలు ఇప్పించడం కేవలం రాజకీయ ప్రచార ఆర్భాటం మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ప్రతిపక్ష నేతలు అంటున్నారు. అటు కర్ణాటకలోనూ, ఇటు తెలంగాణలోనూ అగ్రిగేటర్ కంపెనీల ఏకపక్ష ఐడీ బ్లాకింగ్‌లు , తక్కువ డెలివరీ ఛార్జీలు, కనీస వేతనాలపై ప్రభుత్వాలకు ఏమాత్రం నియంత్రణ లేకుండా పోయిందని, చట్టాలు చేసినా కంపెనీల ఒత్తిడికి ప్రభుత్వాలు తలొగ్గుతున్నాయని గిగ్ వర్కర్లు వాపోతున్నారు.

ఆటో మీటర్ ఛార్జీల అమలు కోసం ఈ నెల 30న ఆటోల బంద్

(హైదరాబాద్, సాక్షర): పెంచిన ఆటో మీటర్ ఛార్జీలను 15 రోజుల్లో అమలు చేయలని ఆటో డ్రైవర్ల జేఏసీ డిమాండ్ చేసింది. అమలు కాకాపోతే పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా ఒకరోజు బంద్‌కు ఆటో డ్రైవర్ల జేఏసీ పిలుపునిచ్చింది. గ్రీన్ క్యాబ్‌లను వెంటనే నిషేధించాలని, ఆటో బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలని జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ద్విచక్ర వాహనాల ట్యాక్సీలను కూడా నిషేధించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల చొప్పున మొత్తం రూ.36 వేలు చెల్లించాలని, గూండాల దాడిలో మృతి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ముకరం కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు



(ఉట్నూర్, సాక్షర) ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు.సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల వినతులను ఆయన స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సిరికొండ మండలం లచ్చింపూర్ గ్రామానికి చెందిన కుంరం దీపక్ తమ గ్రామ చెరువు మరమ్మతుల కోసం దరఖాస్తు కాసిపేట్ మండలం మాలకెపల్లి గ్రామానికి చెందిన భారతి తనకి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించమని గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన పీవీటిజీ గ్రామస్థులు తమకి కోళ్లు ఫారం ను మంజూరు కల్పించామని ఖానాపూర్ మండలం కొలం గూడ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కొరకు దరఖాస్తు అందజేశారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల లబ్ధి, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తమ వినతిపత్రాలను సమర్పించారు.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి చర్యలు



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఐడీఓసీ లో ప్రత్యేక ప్రజావాణి నిర్వహణ
- బాలల నుంచి అర్జీల స్వీకరణ

(రాజన్న సిరిసిల్ల, సాక్షర): బాలల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పిల్లల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (TGSCPCR) బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బోర్డుపై *చిల్డ్రన్ యూ ఆర్ ద ఫ్యూచర్.. ప్లే హై వీ ఆర్ విత్ యూ* అనే సందేశాన్ని జిల్లా కలెక్టర్ రాసి సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన బాలల నుంచి అర్జీలు స్వీకరించారు. దివ్యాంగులు పెన్షన్, అదనపు తరగతి గదులు, విద్యాలయంలో వసతులు, ఇందిరమ్మ ఇండ్లు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశం కల్పించాలనే అంశాలపై దరఖాస్తులు ఇవ్వగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బాలలకు మెరుగైన భవిష్యత్తును అందించడంతో పాటు, వారి హక్కులను కాపాడి, సమస్యలకు పరిష్కారం చూపడమే బాలల ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, విద్యాధికారి విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు

మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి ఆస్తులపై ఏసీబీ దాడులు

- అక్రమ ఆస్తుల ఆరోపణలపై 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు..

(రంగారెడ్డి, సాక్షర): మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి గుండు వాణికి ఏసీబీ అధికారులు షాక్ ఇచ్చారు. ఆదాయానికి మించి ఆస్తులుకూడబెట్టారన్న ఆరోపణలతో హైదరాబాద్, మహబూబ్‌నగర్‌లోని 8ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. గతంలో రూ.75 వేల లంచం కేసులో వాణితో పాటు సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె నివాసంతో పాటు స్థిరాస్తులు, ప్లాట్లు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సోదాల్లోబయటపడిన ఆస్తుల విలువపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

"ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి"



(గుడిహత్నూర్, సాక్షర): ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పరిచయాలను పెంచుతూ స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని ముఖ్య అతిథులు అన్నారు.మండల కేంద్రంలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రం ముందు గల మైదాన ప్రాంతంలో పఠాన్ -11 ఛాంపియన్ క్రికెట్ టోపీని గుడిహత్నూర్ కో ఆప్షన్ మెంబర్ షేక్ జమీర్, మాన్కాపూర్ సర్పంచ్ కోవ భగవాన్, ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి, సామాజిక కార్యకర్తలు అక్బర్ ఖాన్, తరణి ఫిరోజ్, పఠాన్ 11 కెప్టెన్ ఫిరోజ్ ఖాన్ లతో కలిసి ప్రారంభించారు.ముందుగా మైదానంలో గల వికెట్లు, బ్యాట్ లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి రిబ్బన్ కట్ చేశారు. ఆ తర్వాత జమీర్ షేక్ బ్యాటింగ్, దౌలత్ రావు మొకాశి బౌలింగ్ చేస్తూ ఆటను ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రశాంతమైన స్నేహపూర్వక వాతావరణంలో ఎలాంటి గొడవలు చేయకుండా క్రికెట్ ఆటతో ఎంజాయ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కె రాజు, సచిన్ షిండే, నాని, తుకారాం, రషీద్ లతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రికెట్ ఆటగాళ్లు పాల్గొన్నారు.

ఐదు ఇండస్ట్రీస్ పై పీసీబీపై వేటు

(మెదక్, సాక్షర): సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్, కొల్లూరులో నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో వాయు కాలుష్యం పెరుగుతుండటంపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కఠిన చర్యలకు సిద్ధమైంది. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించిన ఐదు నిర్మాణ ప్రాజెక్టులతోపాటు, ఒక రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ప్లాంట్‌ను మూసివేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫారసు చేసింది. వీటికి సంబంధించిన బ్యాంకు గ్యారంటీలను కూడా జప్తు చేయాలని సూచించింది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఈ ప్రాంతాల్లో భారీ నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతుండటంతో పరిసర ప్రాంతాల్లో దుమ్ము, ధూళి సమస్య తీవ్రమవుతోంది. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో పీసీబీ ప్రత్యేక దృష్టి సారించింది. సనత్‌నగర్‌లోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో 16 నిర్మాణ ప్రాజెక్టుల పనితీరుపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని రోలింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పలు ప్రాజెక్టుల వద్ద పర్యావరణ నిబంధనలు పాటించడం లేదని, దుమ్ము నియంత్రణకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో వాయు కాలుష్యం పెరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఐదు నిర్మాణ ప్రాజెక్టుల కార్యకలాపాలను నిలిపివేయాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫారసు చేసింది.అదేవిధంగా ఒక నిర్మాణ ప్రాజెక్టుకు అనుబంధంగా పనిచేస్తున్న ఆర్ఎంసీ ప్లాంట్‌లోనూ తీవ్రమైన ఉల్లంఘనలు గుర్తించారు. పీసీబీ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోకుండానే ప్లాంట్ నిర్వహిస్తుండటంతోపాటు, కాలుష్య నియంత్రణకు అవసరమైన ఏర్పాట్లు చేయలేదని తనిఖీల్లో వెల్లడైంది. కాంక్రీట్ తయారీ సమయంలో వెలువడే ధూళిని నియంత్రించకపోవడం వల్ల పరిసర ప్రాంతాల గాలి నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ ప్లాంట్ కార్యకలాపాలను కూడా తక్షణమే నిలిపివేయాలని కమిటీ సిఫారసు చేసింది.నిర్మాణ రంగ కార్యకలాపాల కారణంగా నివాస ప్రాంతాల్లో వాయు కాలుష్యం పెరగకుండా చూడటంతోపాటు, పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై కఠినంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో పీసీబీ ఈ చర్యలకు ఉపక్రమించింది. ప్రాజెక్టుల మూసివేతతోపాటు బ్యాంకు గ్యారంటీల జప్తునకు సంబంధించిన సిఫారసులపై తదుపరి చర్యలు తీసుకోనుంది.

ఎత్తుగడల వెనుక ఎత్తుగడ!

ఒక అడుగు వెనక్కి వేయడం ఓటమా? ప్రత్యర్థి కదలికలను గమనిస్తూ వేచి ఉండటం బలహీనతా? మౌనంగా ఉండటం చేతకానితనమా? వ్యూహాత్మక ప్రపంచంలో ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు అంత సులభంగా దొరకవు. చైనా చారిత్రక వ్యూహసూక్తుల సంకలనంగా ప్రసిద్ధి చెందిన 'ముప్పై ఆరు వ్యూహాలు' నేటి రాజకీయ, వ్యాపార, అంతర్జాతీయ పరిణామాలను విశ్లేషించడానికి ఆసక్తికరమైన దృక్కోణాన్ని అందిస్తాయి. ప్రత్యర్థి బలాన్ని నేరుగా ఢీకొనకుండా పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకోవడం, సరైన సమయం కోసం వేచి చూడటం, సమాచారాన్ని వ్యూహాత్మకంగా వినియోగించడం వంటి ఆలోచనలు వాటిలో కనిపిస్తాయి. తాజాగా ప్రపంచ సాంకేతిక రంగంలో చోటుచేసుకున్న ఎన్విడియా నాయకత్వ మార్పు ఈ వ్యూహాలపై మరోసారి చర్చకు అవకాశం కల్పించింది. ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో కీలక స్థానంలో ఉన్న సంస్థలో నాయకత్వ మార్పు ఎందుకు ప్రాధాన్యం సంతరించుకుంది? సంస్థ పాలన, సమాచార భద్రత, అంతర్జాతీయ పోటీ మధ్య సంబంధం ఏమిటి? ఈ పరిణామాలు వ్యూహం అంటే ప్రత్యర్థిని ఓడించడం మాత్రమే కాదని, సొంత వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమని గుర్తుచేస్తున్నాయి. బలంతో కాదు.. బుర్రతోనే అసలు ఆట! చైనా 36 వ్యూహాల్లో ప్రతి ఎత్తుగడ వెనుక ఒక ప్రత్యేక ఆలోచన కనిపిస్తుంది. ప్రత్యర్థి దృష్టిని ఒకవైపు మళ్లించి మరోవైపు లక్ష్యాన్ని సాధించడం, అనుకూల సమయం కోసం వేచి చూడటం, బలమైన ప్రత్యర్థిని అతనికి అనుకూలమైన స్థానం నుంచి బయటకు రప్పించడం వంటి పద్ధతులు వాటిలో ఉన్నాయి. 'తూర్పున దాడి చేస్తున్నట్లు చూపి పడమర వైపు లక్ష్యాన్ని సాధించడం', 'పర్వతంపై ఉన్న పులిని మైదానంలోకి రప్పించడం', 'ప్రత్యర్థుల మధ్య విభేదాలను ఉపయోగించుకోవడం' వంటి ఎత్తుగడలు వ్యూహాత్మక ఆలోచనకు ఉదాహరణలు. మరికొన్ని ప్రత్యక్ష ఘర్షణకు బదులుగా సహనం, పరిశీలన, సమాచార సేకరణకు ప్రాధాన్యం ఇస్తాయి. అయితే చారిత్రక యుద్ధతంత్రాలను నేటి సమాజంలో యథాతథంగా అనుసరించాలనే అర్థం కాదు. వాటి నుంచి పరిస్థితులను ముందుగానే అంచనా వేయడం, తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండటం, సొంత బలహీనతలను గుర్తించి సరిదిద్దుకోవడం వంటి పాఠాలను గ్రహించాలి. వ్యూహం పేరుతో మోసం, అనైతిక చర్యలను సమర్థించడం సరికాదు. ఆధునిక ప్రపంచంలో చట్టబద్ధత, పారదర్శకత, నైతికత కూడా విజయానికి కీలకమైన అంశాలు. అగ్రస్థానంలో అనూహ్య మార్పు.. అసలేం జరిగింది? ప్రపంచ కృత్రిమ మేధ రంగానికి అవసరమైన అధునాతన చిప్‌ల రూపకల్పన, సరఫరాలో కీలక సంస్థగా ఎదిగిన ఎన్విడియా నవంబర్ 12, 2026న కీలక ప్రకటన చేసింది. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ, బోర్డు సభ్యుడిగా ఉన్న జెన్సన్ హువాంగ్ రాజీనామాను తక్షణమే అమల్లోకి తీసుకున్నట్లు వెల్లడించింది. సంస్థ ఆర్థిక విభాగం అధిపతి కొలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించింది. శాశ్వత వారసుడి ఎంపిక కోసం అంతర్గత, బాహ్య అభ్యర్థులను పరిశీలించనున్నట్లు బోర్డు తెలిపింది. హార్వీ సి. జోన్స్‌ను బోర్డు తొలి ఛైర్మన్‌గా నియమించింది. అయితే రాజీనామాకు నిర్దిష్ట కారణాన్ని ఆ ప్రకటన వెల్లడించలేదు. అంతకుముందు నవంబర్ 8న సంస్థ బోర్డు ఒక స్వతంత్ర విచారణకు ఆదేశించింది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ జెన్సన్ హువాంగ్ విదేశీ నిధూ ప్రయత్నానికి లక్ష్యంగా మారి ఉండవచ్చన్న వార్తా కథనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు ప్రకటించింది. సంస్థ రహస్యాలు లేదా అమెరికా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు నమ్మడానికి తమకు కారణం లేదని స్పష్టం చేసింది. హువాంగ్ విచారణకు సహకరిస్తారని, ఆయన నాయకత్వంపై తమకు విశ్వాసం ఉందని కూడా వెల్లడించింది. అయితే నవంబర్ 12నాటి రాజీనామా ప్రకటనలో నవంబర్ 8నాటి విచారణను కారణంగా పేర్కొనలేదు. చిప్ రంగంలో భద్రతా విధానాలు ఎందుకు కీలకం? ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ వినియోగం విస్తరిస్తున్న కొద్దీ అధునాతన చిప్‌లకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ రంగంలో సాంకేతిక ఆధిపత్యం సాధించడం సంస్థలకు వ్యాపార అవకాశాలను అందించడమే కాకుండా, దేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలతోనూ ముడిపడుతోంది. అందుకే చిప్‌ల రూపకల్పన, తయారీ, ఎగుమతులు, వినియోగం, సరఫరా వ్యవస్థలపై ప్రభుత్వాలు ప్రత్యేక నియంత్రణలు విధిస్తున్నాయి. అమెరికా కూడా కొన్ని అధునాతన చిప్‌ల ఎగుమతులపై నియంత్రణలు అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయ సాంకేతిక సంస్థలకు ఎగుమతి నిబంధనల పాటింపు, సమాచార రక్షణ, సరఫరా వ్యవస్థల పర్యవేక్షణ అత్యంత కీలకం. ఎన్విడియా బోర్డు ప్రకటించిన స్వతంత్ర విచారణ కూడా సంస్థాగత భద్రతపై ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఏ సంస్థలోనైనా నాయకత్వ మార్పులు, అంతర్గత సమీక్షలు, భద్రతా విధానాలు కేవలం పరిపాలనా అంశాలు కావు. వాటి ప్రభావం పెట్టుబడిదారుల విశ్వాసం, వినియోగదారుల నమ్మకం, అంతర్జాతీయ వ్యాపార సంబంధాలపై పడుతుంది. సాంకేతికంగా ఎంత బలంగా ఉన్నా, సంస్థాగత పారదర్శకత, జవాబుదారీతనం లోపిస్తే విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం కష్టమవుతుంది. ఆధిపత్యం తాత్కాలికం.. విశ్వాసమే శాశ్వతం! ప్రతి పోరాటంలో గెలవడం కంటే, అనవసరమైన పోరాటాన్ని నివారించడం కొన్నిసార్లు గొప్ప విజయం. ప్రత్యర్థి కదలికలను అర్థం చేసుకోవడం ఎంత ముఖ్యమో, సొంత వ్యవస్థలోని బలహీనతలను గుర్తించి సరిదిద్దుకోవడమూ అంతే అవసరం. చైనా 36 వ్యూహాలు పరిస్థితులను అంచనా వేయడం, సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం, వ్యూహాత్మకంగా వ్యవహరించడం వంటి అంశాలను గుర్తుచేస్తాయి. ఎన్విడియా పరిణామాలు నాయకత్వ బాధ్యత, సంస్థాగత పారదర్శకత, సమాచార భద్రత, నమ్మకం వంటి అంశాల ప్రాధాన్యాన్ని ముందుకు తెస్తున్నాయి. ఆరోపణలు లేదా అనుమానాల ఆధారంగా వ్యక్తులపై తుది నిర్ణయాలకు రావడం సరికాదు. అధికారిక ప్రకటనలు, నిర్ధారిత ఆధారాలు, విచారణ ఫలితాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యాపార సంస్థలకు లాభాలు, సాంకేతిక ఆధిపత్యం ఎంత అవసరమో చట్టపాలన, జవాబుదారీతనం, ప్రజల విశ్వాసం కూడా అంతే ముఖ్యం. ప్రపంచాన్ని మార్చగల చిప్‌ను రూపొందించడం సాంకేతిక విజయం కావచ్చు. కానీ ఆ సాంకేతికత వెనుక ఉన్న సంస్థపై ప్రపంచం నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన వ్యూహాత్మక విజయం. -



వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, ఫోన్: 9640466464

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- మారుమూల ఆవాసాలకు సైతం నిరంతర తాగునీటి సరఫరా ఉండాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) వేసవిలో ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి కొరత తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు, పశువులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సోమవారం తన క్యాంపు కార్యాలయంలో తాగునీటి సరఫరా, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని చివరి గ్రామం నుంచి మారుమూల ఆవాసాల వరకు ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పశువులకు సైతం తాగునీటి కొరత లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని ప్రజలు, రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. సాంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, పామాయిల్, నూనెగింజల సాగును ప్రోత్సహించి పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.జిల్లాలో తాగునీరు, సాగునీరు, పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి పరిస్థితులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి

- ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్



(ఆదిలాబాద్ రూరల్, సాక్షర) గ్రామాలలో ప్రజలకు మెరుగైన పాలనా సేవలు, సౌకర్యాలు అందించేందుకే ప్రభుత్వం ఇలాంటి శాశ్వత భవనాలను నిర్మిస్తోందని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ తెలిపారు.ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడం ద్వారా గ్రామ అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మామిడిగూడ సర్పంచ్ మాడావి రాంబాయి, ఉప సర్పంచ్ చరణ్, మాజీ జెడ్పీటీసీ మాడావి రాజు, పటేల్ మార్సుకుల గోవింద్ రావ్, జంగు, హన్మంతు, సారంగ్ రావ్, వార్డు సభ్యులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందాలంటే బ్యాంకు ఖాతాలు తప్పనిసరి



(తలమడుగు, సాక్షర): ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందాలంటే కచ్చితంగా బ్యాంకు ఖాతాలు తెరవాలని బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర తలమడుగు బ్రాంచ్ మేనేజర్ కె వెంకట సాయి కిరణ్ సూచించారు.బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర తలమడుగు శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ వ్యవస్థపై తలమడుగు మండలంలోని లాచింపూర్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు.బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులు ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. దీనితో పాటు జీవిత బీమా పథకం, పీఎం మోడీ స్కీమ్ లు పీఎంజేజేబీవై, పీఎంఎస్ బీవైలతో పాటు పీఎం జన్ ధన్ యోజన, బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, అలాగే అటల్ పెన్షన్ యోజన, నామిని రిజిస్ట్రేషన్, కేవైసీలు, డెత్ క్లెయిమ్ లు అన్ని పథకాలు బ్యాంకులో లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి, ఎస్బీఐ కమలేశ్వర్, లాచింపూర్ సర్పంచ్ ఎస్ జంగు, ఉప సర్పంచ్ పి శీలా, గ్రామ పెద్దలు అషన్నా, బాగ్వాండ్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) చిన్న వయసులోనే అవార్డు అందుకున్న సహస్ర భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సిరిఅర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నిర్మల్‌కు చెందిన చిన్నారి మామిళ్ల సహస్ర తన కూచిపూడి నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.తన నృత్య ప్రతిభతో అందరినీ అలరించిన సహస్రకు నిర్వాహకులు నాట్య మంజరి ప్రశంసాపత్రంతో పాటు నంది అవార్డును ప్రదానం చేశారు.మామిళ్ల లింగయ్య, ఉమాదేవి సంజన దంపతుల కుమార్తె సహస్ర ప్రస్తుతం కడ్తాల్‌లోని వేదిక్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. చిన్న వయసులోనే నృత్యంపై ఆసక్తి పెంచుకున్న సహస్ర నాలుగేళ్ల వయసు నుంచి శిక్షణ ప్రారంభించింది.శిక్షణ ప్రారంభించిన నాటి నుంచి పలు సాంస్కృతిక వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇస్తూ తన ప్రతిభను చాటుకుంటోంది. చిన్న వయసులోనే అవార్డు అందుకోవడంతో కుటుంబ సభ్యులు, గురువులు ఆనందం వ్యక్తం చేశారు.

ఖేలో ఇండియా కార్యక్రమంపై విస్తృత ప్రచారం - జిల్లా కలెక్టర్ కె.హరిత



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) డిసెంబర్ 11 నుండి 22వ తేదీ వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడల కార్యక్రమం పై జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, క్రీడల శాఖ ఎం.డి. సోని బాలదేవి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు యువజన క్రీడా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా యువజన సేవల క్రీడా శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెల 11 నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ర్యాలీలు నిర్వహించి పెద్ద ఎత్తున క్రీడాకారులు యువజన సంఘాలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని, మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలలో ప్లేక్స్‌లను ఏర్పాటు చేసి, ఖేలో ఇండియా ప్రాముఖ్యతను తెలియజేసేందుకు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా "ది మేజ్" సినిమా ట్రైలర్ రిలీజ్



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రేష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్ పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. "ది మేజ్" చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. త్వరలో ఈ సినిమా గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు డైరెక్టర్, ప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ అతిథులుగా "ది మేజ్" సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవోపీ శివకృష్ణ మాట్లాడుతూ - మా మూవీ చాలా బాగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం. విజువల్ పరంగా నాకు మంచి గుర్తింపు తీసుకొచ్చే చిత్రమిది. అన్నారు. నటి శ్రేష మాట్లాడుతూ - మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని అనుకుంటున్నాం. ఈ సినిమాలో హారిక పాత్రలో నటిస్తున్నాను. ఇలాంటి మంచి టీమ్ తో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది. హీరో శ్రీరామ్ ఫ్రెండ్లీగా ఉంటూ మాకు సపోర్ట్ అందించారు. అన్నారు. నిర్మాత డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి మాట్లాడుతూ - ఈ సినిమా కథ చెప్పినప్పటి కంటే స్క్రీన్ మీద చూసినప్పుడు ఎక్కువ థ్రిల్ అయ్యాను. ఈ సినిమా ప్రివ్యూ చూస్తున్నప్పుడు సెకండాఫ్ చూపు తిప్పుకోలేకపోయాను. అంత గ్రిప్పింగ్ గా రూపొందించారు మా డైరెక్టర్. ఈ సినిమాలో శ్రీరామ్ గారు జాయిన్ అవడంతో మరింత స్ట్రాంగ్ ప్రాజెక్ట్ అయ్యింది. మా చిత్రంలో హీరో శ్రీరామ్, ఇద్దరు హీరోయిన్స్ బాగా పర్ ఫార్మ్ చేశారు. నాకు సినిమాలంటే పెద్ద ఆసక్తి ఉండదు. కానీ ఇలాంటి ప్రాజెక్ట్ లలో భాగమవడం సంతోషంగా ఉంది. అన్నారు. నటుడు రవివర్మ మాట్లాడుతూ - ఈ చిత్రంలో తల్వార్ సింగ్ అనే క్యారెక్టర్ లో నటించాను. ఈ సినిమాలో థర్టీ ఇయర్స్ పృథ్వీ గారితో కలిసి కొన్ని కామెడీ సీన్స్ చేశాం కానీ అవి ఎడిటింగ్ లో పోయాయి. కానీ కరెక్ట్ గా కథలో మాత్రం నా సీన్స్ కీలకంగా ఉంటాయి. శ్రీరామ్ గారితో కలిసి ఈ మూవీ చేయడం హ్యాపీగా ఉంది. హ్రితిక శ్రీనివాస్ తో వదలా మూవీలో నటించాను. వివిధ జానర్స్ కలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని నమ్ముతున్నాం. అన్నారు. నటుడు కమల్ కామరాజు మాట్లాడుతూ - టాలీవుడ్ లో ది మేజ్ లాంటి సరికొత్త థ్రిల్లర్స్ రావడం మనమంతా సంతోషించదగిన విషయం. ఇలాంటి సినిమా చేయడం సులువుకాదు. కేవలం స్క్రిప్ట్ మాటలు రాసుకోవడం కాదు సౌండ్ డిజైన్, ఎడిటింగ్, విజువల్స్..ఇలా ప్రతిదీ ప్లాన్ చేసుకోవాలి. ఎంతో అనుభవం ఉన్న డైరెక్టర్ చేసినట్లు ఈ సినిమాను రవికిరణ్ రూపొందించారు. ఈ సినిమా నేను చూశాను. మీరు ఊహించని ట్విస్టులతో ఆకట్టుకుంటుంది. పాన్ ఇండియా ఆడియెన్స్ కు రీచ్ అయ్యే చిత్రమిది. ఇలాంటి సినిమాను థియేటర్స్ లోనే చూడాలి. అన్నారు. హీరోయిన్ హ్రితిక శ్రీనివాస్ మాట్లాడుతూ - ఈ చిత్రంలో ఈషా అనే క్యారెక్టర్ లో నటిస్తున్నాను. నా కెరీర్ లో చేసిన గొప్ప క్యారెక్టర్ ఇదేనని నమ్ముతాను. డైరెక్టర్ రవి కిరణ్ గారు కథ చెప్పినప్పుడు రెండు రోల్స్ లో ఏది కావాలంటే అది సెలెక్ట్ చేసుకోవచ్చు అన్నారు. నేను హీరోయిన్ గానే కాదు నటిగా పర్ ఫార్మర్ గా పేరు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఈషా రోల్ లో ఆ స్కోప్ ఉందనిపించింది. ఈ సినిమా రిలీజ్ అయ్యాక తప్పకుండా వైరల్ అవుతుంది. నేను నటుడిగా జర్నీ చేస్తూ వస్తున్నా. ఎప్పుడు సక్సెస్ వస్తుందో తెలియదు. అందుకే ప్రతి ప్రాజెక్ట్ ను జాగ్రత్తగా చేసుకుంటునన్నా. ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతున్నా. అన్నారు. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ - సినిమా ప్రారంభమయ్యే టైమ్ లో డైరెక్టర్ నాకు ఈ కథ చెప్పారు. నేను విన్న కథ స్క్రీన్ మీద ఎలా ఉంటుందో చూద్దామని వచ్చాను. ట్రైలర్ ఇంట్రెస్టింగ్ గా ఉంది. సర్ ప్రైజ్ అయ్యేలా కథ చెప్పినదాని కంటే చాలా బాగా రూపొందించారు. ప్రతి టెక్నీషియన్, ఆర్టిస్టులు ఎంతో ప్యాషన్ తో పనిచేసినట్లు తెలుస్తోంది. నేను చెన్నైలో పుట్టి పెరిగా కాబట్టి నాకు శ్రీరామ్ గారు శ్రీకాంత్ గానే పరిచయం. నేను కాలేజ్ లో ఉండగా శ్రీరామ్ గారి సినిమాలు చూశాను. ఇప్పుడు నేను ప్రొఫెసర్ లా అయ్యాను. ఆయన స్టూడెంట్ లాగే ఉన్నారు. సిన్సియర్ గా వర్క్ చేస్తూ వెళ్తుంటే తప్పకుండా సక్సెస్ వస్తుందని శ్రీరామ్ గారు చెప్పిన మాట మనందరికీ ఒక మెసేజ్ లా తీసుకోవచ్చు. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు. నటీనటులు - శ్రీరామ్ (శ్రీకాంత్), ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు, రవివర్మ, శ్రేష, తదితరులు

'ఆకాశంలో ఒక తార' దుల్కర్ గారి కెరీర్‌లో మరో మైల్‌స్టోన్ మూవీగా నిలుస్తుంది.:ఐకాన్ స్టార్ అల్లు అర్జున్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, సాంగ్ తో సినిమా పై అంచనాలు పెరిగాయి. 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఐకన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. మీ అందరి ప్రేమ, అభిమానానికి థాంక్యూ. ఒక ఆర్మీలా నా వెనుక ఉండి నన్ను ప్రేమించే నా ఫ్యాన్స్ అందరికీ కృతజ్ఞతలు. ఈ ఫంక్షన్‌ను ఇంత గ్రాండ్ సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థాంక్యూ. నాకు దుల్కర్ గారంటే చాలా ఇష్టం. మలయాళం, తమిళం, హిందీ, తెలుగు ఇలా అన్నీ భాషల్లో అద్భుతమైన సినిమాలు చేస్తున్నారు. ఆయన వెర్సటైల్ యాక్టర్. సినిమాల ఎంపిక కూడా చాలా బాగుంటుంది. చాలా స్వీట్ పర్సన్, వండర్‌ఫుల్ పర్సన్. కేరళలో మెగాస్టార్ మమ్ముట్టి గారి అబ్బాయి అయినప్పటికీ చాలా హంబుల్‌గా ఉంటారు. అందరినీ కలుపుకుంటూ వెళ్తారు. . అదే ఆయనకు మంచి సక్సెస్‌ను తీసుకొస్తుంది. నిర్మాతగా కూడా ఆయనంటే నాకు చాలా ఇష్టం. ఆయన నిర్మించిన 'లోక' సినిమా చూశాను. చాలా అద్భుతంగా ఉంది. ఆకాశంలో ఒక తార ఆయన కెరీర్ లో మరో మైల్ స్టోన్ మూవీ అవుతుంది ఈ సినిమాతో హీరోయిన్‌గా పరిచయమవుతున్న సాత్వికకు ఆల్ ది బెస్ట్. వెల్ కం టు తెలుగు సినిమా. శ్రుతి హాసన్ లాంటి కమర్షియల్ స్టార్ ఈ సినిమాలో కీలక పాత్ర చేయడం చాలా హ్యాపీగా ఉంది. అలాగే రుహాని కూడా చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేస్తుంది. జీవీ ప్రకాష్ గారు 'ఇరుముడి', 'లక్కీ భాస్కర్', 'విశ్వనాథన్' ఇలా వరుసగా మంచి సినిమాలు, విజయాలు అందిస్తున్నారు. పవన్ సాధినేని తొలి సినిమా 'ప్రేమ ఇష్క్ కాదల్' చాలా అద్భుతంగా తీశాడు. తనను పిలిపించి మాట్లాడాను. తను చాలా టాలెంటెడ్ డైరెక్టర్. సరైన సమయం వచ్చినప్పుడు తన టాలెంట్‌ను నిరూపించుకుంటాడని అనిపించింది. ఈ సినిమాలో ఆ ఎనర్జీ కనిపిస్తోంది. మా నాన్నగారు ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. విద్యా అక్క సీతమ్మగా ఉన్నారు. స్వప్న గారు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. దత్తు గారి లెగసీని వారు ముందుకు తీసుకెళ్లడం చాలా ఆనందంగా ఉంది. వాళ్లు చాలా అద్భుతమైన సినిమాలను నిర్మిస్తున్నారు. వారి విషయంలో నాకు చాలా గర్వంగా ఉంది. గుణ్ణం గంగరాజు గారి కుటుంబం నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. వారికి ఆల్ ది బెస్ట్. మా నాన్నగారు చాలా సినిమాలు చూస్తుంటారు. ఎప్పుడైనా ఇంటికి వచ్చినప్పుడు మామూలుగానే ఉంటారు. కానీ ఈ సినిమా చూసి చాలా ఎక్సైటెడ్‌గా ఉన్నారు. సినిమా చాలా బాగుందని, మనసుకు బాగా నచ్చిందని చెప్పారు. ఆయన ఎప్పుడో కానీ అలా చెప్పరు. నా సినిమాల గురించి కూడా అంతగా చెప్పరు. అలాంటిది ఈ సినిమా గురించి అలా అన్నారంటే కచ్చితంగా ఇందులో మంచి సోల్ ఉందని అర్థం. ఈ సినిమాలో మొత్తం పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. ప్రతి అమ్మాయి కల నెరవేరాలనేది ఇందులోని ప్రధాన అంశం. చాలా బ్యూటిఫుల్ పాయింట్. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అభిమానులందరికీ థాంక్యూ. హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. 'సీతారామం' తర్వాత ఈ కథ విన్నాను. కథ విన్నప్పుడే చాలా స్పెషల్‌గా అనిపించింది. కచ్చితంగా ఇది నా కెరీర్‌లో ఒక స్పెషల్ సినిమాగా నిలిచిపోతుందని నమ్ముతున్నాను. స్వప్నకు, అల్లు అరవింద్ గారికి థాంక్యూ. అల్లు అరవింద్ గారు చాలా డెడికేషన్‌తో వర్క్ చేస్తారు. ఆయన ఎంతో ఎనర్జీగా ఉంటారు. బహుశా బన్నీ గారు కూడా అంత ఎనర్జీగా ఉండటానికి కారణం అరవింద్ గారే. గుణ్ణం గంగరాజు గారికి థాంక్యూ. వారితో కలిసి పనిచేయడం మంచి ఎక్స్‌పీరియన్స్. అలాగే రాజ్‌కుమార్, మహేశ్‌లతో కలిసి పనిచేయడం కూడా చాలా హ్యాపీగా అనిపించింది. శ్వాసిక మా అక్క పాత్రలో కనిపిస్తుంది. బన్నీ గారికి సంబంధించిన ఒక మంచి సంఘటన మీతో పంచుకోవాలి. నా మొదటి సినిమా షూటింగ్ కేరళలోని ఒక పల్లెటూరిలో జరిగింది. అక్కడ నేను ఉంటున్న ఇంట్లో ఒక బీరువా మీద బన్నీ గారి ఫోటో ఉండేది. అప్పటికే ఆయన స్టార్‌గా ఎంతో పేరు సంపాదించారు. ఇప్పుడు గ్లోబల్ స్టాయికి చేరుకున్నారు. 'అల వైకుంఠపురములో' నాకు ఫేవరెట్ సినిమా. కరోనా సమయంలో మా ఫ్యామిలీ అంతా కలిసి ఎన్నోసార్లు ఆ సినిమా చూశాం. అలాగే అల్లు అర్జున్ గారికి మా పాప పెద్ద ఫ్యాన్. ఆయన మా వేడుకకు రావడం ఎంతో ఆనందంగా ఉంది.'ఆకాశంలో ఒక తార' కచ్చితంగా మనమందరం గర్వపడే సినిమా అవుతుందని నమ్ముతున్నాను. డైరెక్టర్ పవన్ సాధినేని మాట్లాడుతూ.. "ముందుగా బన్నీ అన్నకు థాంక్యూ. నా మొదటి సినిమా 'ప్రేమ ఇష్క్ కాదల్' చూసి, 'రేసుగుర్రం' సక్సెస్ పార్టీకి పిలిపించి ఆయన నన్ను ప్రోత్సహించిన విధానాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. అదంతా నాకు ఒక కలలా అనిపించింది. ఆయన చెప్పిన మాటే ఈ 13 ఏళ్లుగా నన్ను ముందుకు నడిపించింది.కరోనా సమయంలో ఈ కథ రాశాను. ఈ కథను అరవింద్ గారికి, గుణ్ణం గంగరాజు గారికి చెప్పగానే వాళ్లకు చాలా నచ్చింది. స్వప్న గారు ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చిన తర్వాత అంతా ఒక మ్యాజిక్‌లా జరిగింది. సుచిత్రా అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. జీవీ ప్రకాష్ గారు కథ విన్న వెంటనే ఇది బ్లాక్‌బస్టర్ అవుతుందని చెప్పారు. ఆయన అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు.దుల్కర్ గారు కథ చెప్పినప్పటి నుంచి ఇప్పటివరకు నాపై ఎంతో నమ్మకం ఉంచి, నన్ను ప్రోత్సహించారు. ఆయన లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. సాత్విక అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. ఈ సినిమా చూసిన తర్వాత అందరూ తన గురించి మాట్లాడుకుంటారు. అలాగే కథ విన్న వెంటనే శ్రుతి హాసన్ గారు తన క్యారెక్టర్ చేయడానికి అంగీకరించారు. అది మాకు మరింత స్పెషల్‌గా అనిపించింది. చైతు సహా ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ థాంక్యూ. ప్రతి ఆడపిల్ల కల సాకారం చేయడానికి సహకరించాలి. కచ్చితంగా ఇది ఒక స్ఫూర్తినిచ్చే సినిమాగా మీరందరూ ఆస్వాదిస్తారని కోరుకుంటున్నాను. హీరోయిన్ సాత్విక మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. మా నిర్మాతలకు ధన్యవాదాలు. మా టీమ్‌లో ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ థాంక్యూ. రుహాని గారు, శ్రుతి హాసన్ గారు, శ్వాసిక గారు.. ఇలా అందరూ నాకు ఎంతో సపోర్ట్ చేశారు.అల్లు అర్జున్ గారికి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయనతో కలిసి ఒక్కసారైనా డాన్స్ చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో దుల్కర్ గారితో కలిసి పనిచేయడం చాలా గొప్ప ఎక్స్‌పీరియన్స్. సెట్స్‌లో మేము ఎప్పుడూ గొడవ పడుతూ ఉండేవాళ్లం. అలా గొడవ పడకపోతే ఏదో నార్మల్‌గా లేదనిపించేది. నాకు ఏదైనా హెల్ప్ కావాలంటే మొదట వచ్చేది ఆయనే. ఈ స్నేహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. మా డైరెక్టర్ నాపై ఉంచిన నమ్మకం నన్ను ముందుకు నడిపిస్తుంది. ప్రేక్షకులు సపోర్ట్ కావాలని కోరుకుంటున్నాను. ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బన్నీ ఫ్యాన్స్‌కు, దుల్కర్ ఫ్యాన్స్‌కు నమస్తే. ఎందుకంటే ఈ కథ కూడా అలాంటిదే. ఒక మారుమూల పల్లెటూరిలో మెరిసిన ఓ కల ఇది. అలాంటి అద్భుతమైన కథను నమ్మి సందీప్, రమ్య గున్నం బలంగా ముందుకు తీసుకెళ్లారు. వారికి స్వప్న రూపంలో బలమైన తోడు దొరికింది. తన పేరుకు తగ్గట్టుగానే ఈ కలను నెరవేర్చడానికి స్వప్న పూనుకున్నారు. ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎలాంటి పర్ఫార్మెన్స్ ఇచ్చారో సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులే చెప్తారు" ప్రొడ్యూసర్ సందీప్ గున్నం మాట్లాడుతూ.. "మంచి కథలు చెప్పాలనేది మా డ్రీమ్. ఈ విషయంలో అరవింద్ గారికి, స్వప్న గారికి ధన్యవాదాలు చెప్పాలి. వాళ్ల వల్లే ఈ జర్నీ సాధ్యపడింది. ఇది చాలా మంచి కథ. స్ఫూర్తినిచ్చే కథ. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను. చైతు జొన్నలగడ్డ మాట్లాడుతూ..గత ఏడాది నవంబర్ 20న 'రాజు వెడ్స్ రాంబాయి' వచ్చింది. ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార' వస్తోంది. అలాగే మమ్ముట్టి గారితో 'ఓం' సినిమా కూడా చేస్తున్నాను. ఇది నాకు లక్కీ. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా నిర్మాతలకు థాంక్యూ. దుల్కర్ గారు చాలా స్వీట్ పర్సన్. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా. మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది. శ్వాసిక మాట్లాడుతూ.. ఈ సినిమాలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. మా నిర్మాతలకు, డైరెక్టర్ పవన్ గారికి థాంక్యూ. దుల్కర్ గారితో సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. నవంబర్ 20న సినిమా చూడండి. మమ్ముట్టి అందరినీ సపోర్ట్ చేయండి" రుహాని శర్మ మాట్లాడుతూ.. " 'ఆకాశంలో ఒక తార' కథ నాకు పర్సనల్‌గా కనెక్ట్ అయింది. మన పరిస్థితుల వల్ల మన కలలను ఎప్పుడూ పరిమితం చేసుకోకూడదు. ఈ సినిమాలో నేను ఒక స్పెషల్ రోల్ ప్లే చేశాను. నా పాత్ర పేరు బిజిలి. ఆ పాత్ర నాకు చాలా స్పెషల్. నాకు ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చిన మా డైరెక్టర్ పవన్ గారికి థాంక్యూ. దుల్కర్ గారితో మరిన్ని సినిమాల్లో కలిసి పనిచేయాలని ఉంది. శ్రుతి హాసన్ గారు కూడా ఇందులో అద్భుతమైన పాత్ర చేశారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూడండి. మీ ఇంట్లోని ఆడపిల్లలను కూడా సినిమాకు తీసుకెళ్లండి. థాంక్యూ సో మచ్ లిరిక్ రైటర్ శ్రీమణి మాట్లాడుతూ.. "ఈ సినిమాలో పాటల ప్రయాణం చాలా అద్భుతంగా జరిగింది. పవన్ గారు ఈ కథ చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ ఆల్బమ్ నాకు చాలా స్పెషల్. మంచి పాటలు రాసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, దర్శకుడికి ధన్యవాదాలు. ఈ వేడుకలో సినిమా యూనిట్ అందరూ పాల్గొన్నారు.

హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగిన 'హార్ట్స్ అక్రాస్ ది సీ' యానిమేటెడ్ షార్ట్ ఫిలిం ప్రీమియర్



- ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్
- ప్రేమ, స్నేహం, సాహసంతో అమెరికా నుంచి ఇటలీ వరకు సాగే భావోద్వేగ ప్రయాణం

రిట్జ్ ఆర్ట్ హౌస్, అమెరికా నిర్మించిన యానిమేటెడ్ షార్ట్ ఫిలిం 'హార్ట్స్ అక్రాస్ ది సీ' (Hearts Across the Sea) ప్రత్యేక ప్రీమియర్ హైదరాబాద్లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్ జరిగింది. ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ ప్రీమియర్ కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు డా. అపర్ణ వొల్లూరు (Dr. Aperna Volluru) క్రియేట్ చేసిన మూలకథ, పాత్రల ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి ఆంటోనియో ఆండ్రియాజ్జో (Antonio Andreazzo) దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. ప్రసాద్ గారపాటి నిర్మాతగా, మణీంద్ర కుమార్ (Maneendra Kumar) ఆర్ట్ డైరెక్టర్గా పనిచేశారు. ఈ చిత్రం నిడివి 24 నిమిషాల 48 సెకన్లు. అమెరికాలోని ఒరెగాన్ ప్రాంతంలో నివసించే బీవర్ కుటుంబం, వారి స్నేహితులు 'వ్యాలీ హార్ట్' అనే నౌకలో చేపట్టే సముద్రయాత్ర చుట్టూ ఈ కథ సాగుతుంది. ఇటలీలోని వెరోనా నగరాన్ని చూడాలన్న భార్య కలను నెరవేర్చేందుకు భర్త చేసే ప్రయత్నం... స్నేహం, ధైర్యం, అనుకోని సవాళ్లు, పరస్పర సహకారంతో కూడిన సాహసయాత్రగా మారుతుంది. ఒరెగాన్ నుంచి వెనిస్ మీదుగా వెరోనా వరకు సాగే ఈ ప్రయాణం ప్రేక్షకులను కొత్త ప్రదేశాలకు తీసుకెళ్తుంది. "ప్రేమ అనేది మనం అనుభూతి చెందేది మాత్రమే కాదు... మన చేతల్లో చూపించేది కూడా" అనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుంది. మానవ కళాకారులు సృష్టించిన చిత్రాలకు ఏఐ సహకారంతో చలనరూపం ఇవ్వడం ఈ నిర్మాణంలోని ప్రత్యేకత. పాత్రల రూపకల్పన, పరిసరాలు, కెమెరా కూర్పులను కళాకారులే రూపొందించారని చిత్రబృందం తెలిపింది. అనంతరం ఏఐ ఆధారిత ఇమేజ్-టు-వీడియో సాంకేతికతతో వాటిని యానిమేట్ చేశారు. స్క్రిప్ట్లు, సంభాషణలు, సంగీతాన్ని జనరేటివ్ ఏఐ ఉపయోగించకుండా సృష్టించినట్లు పేర్కొన్నారు. మూలకథ, పాత్రలక్రియేటర్ డా. అపర్ణ వొల్లూరు మాట్లాడుతూ: "సముద్రాలను, సంస్కృతులను దాటి సాగే ఈ ప్రయాణం ద్వారా దయ, సహానుభూతి, స్నేహం ఎంతటి తుఫానునైనా ఎదుర్కోగలవని చెప్పాలనుకున్నాను. ప్రేమ అనేది మాటల్లోనే కాదు, మనం చేసే పనుల్లోనూ కనిపించాలనేది ఈ కథ వెనుక ఉన్న ఆలోచన." మై స్కూల్ ఇటలీ చైర్మన్, చిత్ర నిర్మాత ప్రసాద్ గారపాటి మాట్లాడుతూ:"మా తరగతి గదుల్లో పిల్లలకు స్ఫూర్తినిచ్చిన పాత్రలు ఇప్పుడు తెరపై ప్రాణం పోసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. విద్యా కథలు తరగతి గదుల నుంచి యానిమేషన్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన అందమైన ప్రయాణానికి ఈ చిత్రం ప్రతీక." దర్శకుడు, నిర్మాత ఆంటోనియో ఆండ్రియాజ్జో మాట్లాడుతూ: "నా కుటుంబ మూలాలు ఇటలీలోని వెనెటో ప్రాంతంలో ఉండటంతో వెనిస్, వెరోనా నగరాలు నా హృదయానికి ఎంతో దగ్గరగా ఉంటాయి. ఒరెగాన్లోని మా అటవీ పాత్రలను ఇటలీకి తీసుకెళ్లే మరపురాని ప్రయాణాన్ని చూపించాలనుకున్నాను. స్నేహం, సాహసం, ప్రేమ ద్వారా రెండు ప్రపంచాలను కలిపే ప్రయత్నమే ఈ చిత్రం." చిన్నారులు, కుటుంబ ప్రేక్షకుల కోసం రూపొందిన ఈ చిత్రాన్ని మరింత విస్తృతమైన ప్రేక్షకులకు పరిచయం చేసే దిశగా హైదరాబాద్ ప్రీమియర్ ఒక ముఖ్యమైన ముందడుగని రిట్జ్ ఆర్ట్ హౌస్ తెలిపింది.

ద రేడియన్స్ వార్ సీజన్ 2 టాలెంట్ కం ఫ్యాషన్ షో కు మొదలైన సెలక్షన్స్

(హైదరాబాద్, సాక్షర): ఫ్యాషన్,డిజిటల్,మీడియా రంగాలలో అత్యంత అనుభవజ్ఞురాలైన ప్రముఖ యాంకర్ హాసిని వర్మ ఆధ్వర్యంలో స్కైల్ ప్రొడక్షన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ది రేడియన్స్ వార్ సీజన్ 2 టాలెంట్ కం ఫ్యాషన్ షో కు సెలక్షన్స్ మొదలయ్యాయని షో నిర్వాహకురాలు హాసిని వర్మ తెలియజేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్,ఎర్రగడ్డలోని జనప్రియ మెట్రోపాలిస్ క్లాసిక్ హోమ్స్ గ్రౌండ్స్ లో సెలక్షన్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి రాచరికం మూవీ డైరెక్టర్ సురేష్,ప్రముఖ మోడల్, యాక్టర్ రూపేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హాసిని వర్మ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో తమ మొదటి ది రేడియన్స్ వార్ సీజన్ వన్ ను సారధి స్టూడియో వేదికగా నిర్వహించామని అప్పుడు తమ షోకు అద్భుతమైన ఆదరణ లభించింది అన్నారు.ఇప్పుడు 2026 లో తిరిగి తమ సీజన్ 2 ను ప్రారంభించామని షో ఫినాలే డిసెంబర్ నెలలో నిర్వహించబోతున్నామని అన్నారు.ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగం మీద మక్కువ గల యువతులు,మహిళలు అనేక కేటగిరీలలో పోటీపడ్డారు. సెలక్షన్స్ ఇంకా కూడా కొనసాగుతాయని ఫ్యాషన్ రంగం అంటే అభిమానం ఉన్న యువతులు మహిళలు తమ స్కైల్ ప్రొడక్షన్స్ ని సంప్రదించవచ్చు అని వారు తెలియజేశారు.సెలక్షన్ వేడుకలలో మాధవి కొల్ల,పావని రెడ్డి,నేహా,దివ్,మానస,మనీషా,రామ్ మల్లె తదితరులు పాల్గొన్నారు.

హే కన్నమ్మ' సినిమా టీజర్ రిలీజ్



యశ్వంత్, ధనశ్రీ వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'హే కన్నమ్మ'. శశి కుమార్ ముత్తులూరి రచన, దర్శకత్వంలో, జీ స్టూడియోస్ సమర్పణలో, దిల్ రాజు ప్రొడక్షన్స్ LLP బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ''నా జీవితం నా కలలు నా ఆశలు నా ఇష్టాలు.. నాది నేను అని బ్రతికిన నాకు ఇప్పుడు నీ కళ్ళతో ప్రపంచాన్ని చూస్తుంటే.. నువ్వు కోరుకున్న ప్రేమ ఎలా ఉంటుందో నాకు అర్థం అవుతుంది కన్నమ్మ' అనే వాయిస్ ఓవర్ తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. యశ్వంత్, ధనశ్రీ వర్మ పాత్రలని ప్రజెంట్ చేసిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచింది. జయ్ కృష్ణ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాంపీ నందిగం సినిమాటోగ్రఫీ, గాంధీ నడికూడికర్ ప్రొడక్షన్ డిజైన్ సినిమాకు మంచి విజువల్ ఫీల్ తీసుకొచ్చాయి.దిల్ రాజు ప్రొడక్షన్స్ నిర్మాణ విలువలు టాప్ క్యాలిటీలో ఉన్నాయి. అందమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న 'హే కన్నమ్మ' టీజర్ ప్రస్తుతం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. నటీనటులు: యశ్వంత్, కార్తిక మురళీధరన్, ధనశ్రీ వర్మ, వెంకటేష్ కాకుమాను, బ్రహ్మాజీ తదితరులు

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com